ప్రజాశక్తి
కర్నూలు

ఆదివారం
జనవరి
07 - 2018
12 పేజీలు



ఎపిజిబి మేనేజర్
సజీవ దహనం

కారులో మంటలు చెలరేగి ఆంధ్రాప్రగతి గ్రామీణ బ్యాంకు గార్లదిన్నె మేనేజర్ సజీవ దహనం అయ్యారు.

వార్త 3లో

శాస్త్ర, సాంకేతిక రంగాలపై
నిర్లక్ష్యం

- సిసిఎంబి మాజీ డైరెక్టర్ మోహన్‌రావు
- భావిశాస్త్రవేత్తలుగా మారాలి
- శాస్త్రవేత్త మోటూరు కృష్ణప్రసాద్
- రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ప్రారంభం



ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌రావు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధి పట్ల పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని సిసిఎంబి మాజీ డైరెక్టర్ డాక్టర్ మోహన్‌రావు తెలిపారు. శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధికి జిడిపిలో కనీసం 2 శాతం నిధులను కేటాయించాల్సిందిపోయి అసలు కేటాయింపులు చేయడం లేదన్నారు. శనివారం కర్నూలు నగరంలోని ఎక్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో మూడ్రోజుల జెవివి రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిసిఎంబి మాజీ డైరెక్టర్ డాక్టర్ మోహన్‌రావు, ప్రముఖ శాస్త్రవేత్త మోటూరు కృష్ణప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, చెకుముకి నిర్వాహకులు, నీట్ ప్రొఫెసర్ డాక్టర్ రామచంద్రయ్య, ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ, కర్నూలు మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీహరి, డాక్టర్ విజయశంకర్, ఆహ్వాన సంఘం వార్త 4లో

సిఎం గారూ...
కరువుకేసి చూడండి



- నేడు ముఖ్యమంత్రి పర్యటన
- సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి దాదాపు చంద్రబాబు నాయుడు నెలకోసారి జిల్లా పర్యటనకు వస్తున్నారు. జిల్లాకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు మాత్రం మూడడుగులు ముందుకు, ఆరడుగులు వెనక్కి అన్న చందంగా అమలవుతున్నాయి. జిల్లా పశ్చిమ ప్రాంతం సస్యశ్యామలం చేసేందుకు తుంగభద్ర నదిపై గుండ్రేవుల రిజర్వాయర్‌ను, వేదవతి నదిపై రెండు ఎత్తిపోతల పథకాలను యుద్ధప్రాతిపదికన చేపడతామని హామీఇచ్చారు. ఆ హామీకి సంబంధించి ఇప్పటిదాకా సర్వేలు పూర్తి కావడం మినహా ఒక్క అడుగూ ముందుకు పడని పరిస్థితి ఉంది. అలాగే ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తామని చెప్పినా ఇంతవరకూ అది పునాది రాయి దాటి బయటకు రాలేదు. ఓర్వకల్లు వద్ద ఇండస్ట్రీయల్ హబ్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీలో సోలార్ వార్త 4లో

సిపిఎం జిల్లా మహాసభలను
జయప్రదం చేయండి
జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఆలూరులో ఈనెల 10, 11, 12న నిర్వహించే సిపిఎం 21వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి కోరారు. శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా మహాసభల్లో మొదటి రోజు 10వేల మందితో భారీ ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. 11, 12న ప్రతినిధుల సభలు జరుగుతాయని చెప్పారు. ఈ సభలకు 54 మండలాల నుంచి 350 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ మహాసభలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్, రాష్ట్ర వార్త 4లో



మాట్లాడుతున్న కె.ప్రభాకర్‌రెడ్డి

చంద్రన్న బీమా చెక్కులు పంపిణీ

వెల్దుర్తి రూరల్ : మండలంలోని రామళ్లకోట, గోవర్ధనగిరి గ్రామాలకు చెందిన విద్యార్థులకు ప్రధాన మంత్రి చంద్రన్న బీమా కింద శనివారం చెక్కులు పంపిణి చేసినట్లు ఎపిఎం కాశీశ్వరుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గోవర్ధనగిరి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు రూ. 3,08,400 లక్షలు, రామళ్లకోట విద్యార్థులకు రూ. 2,28,000 లక్షలు పంపణీ చేశామన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కోడుమూరు రూరల్ : కోడుమూరు మండలంలోని సమస్యలు పరిష్కరించాలని సిపిఎం, వ్యకాస నాయకులు డిప్యూటీ సిఎం కెఇ.కృష్ణమూర్తికి వినతి పత్రం అందజేశారు. శనివారం ప్యాలకుర్తి గ్రామానికి విచ్చేసిన ఉపముఖ్యమంత్రి కెఇ.క్రిష్ణమూర్తిని కలిసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా వ్యకాస డివిజన్ కార్యదర్శి సోమన్న మాట్లాడుతూ కోడుమూరు పట్టణం, ప్యాలకుర్తి గ్రామంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి నిధులు కేటాయించాలని కోరారు. ప్యాలకుర్తిలో ఇళ్ల పట్టాలు ఇచ్చిన వారికి స్థలాలు చూపాలన్నారు. ఐకెపిలో పనిచేస్తున్న మహిళలకు వేతనాలు పెంచిన జీవో ప్రకారం రూ.2 వేలు ఇవ్వాలన్నారు. స్పందించిన కెఇ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. సిఐటియు డివిజన్ అధ్యక్షులు గఫూర్‌మియ్య, గొర్రెల కాపరుల సంఘం డివిజన్ కార్యదర్శి ఎర్రమద్దిలేటి పాల్గొన్నారు.

కేంద్ర సహకారంతోనే సంక్షేమ పథకాలు

కర్నూలు అర్బన్ : కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కపిలేశ్వరయ్య అన్నారు. శనివారం ప్రకాష్ నగర్‌లోని స్వగృహంలోని ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న జన్మభూమి–మాఊరు సభలో కేంద్ర బిజెపి ప్రభుత్వ పాత్రను తొలగించడం సరికాదన్నారు.

మద్యంషాపును తొలగించాలని మహిళలు నిరసన

సిపిఎం ఆధ్వర్యంలో జన్మభూమి అడ్డగింపు
వారంలోగా తరలిస్తామని ఎక్సైజ్ సిఐ హామీ

ప్రజాశక్తి - ఓర్వకల్లు

మండలంలోని నన్నూరు గ్రామంలో మద్యం షాపును తొలగించాలని మహిళలు శనివారం జరిగిన జన్మభూమి కార్యక్రమంలో నిరసన తెలియజేశారు. సిపిఎం నన్నూరు శాఖ కార్యదర్శి షాజహాన్ ఆధ్యక్షతన జరిగిన దాదాపు రెండుగంటల పాటు కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పాణ్యం డివిజన్ కార్యదర్శి జి.రామకృష్ణ, మండల కన్వీనర్ బి.నాగన్న మాట్లాడారు. వారాది బ్రిడ్జి దగ్గర మద్యందుకాణం ఏర్పాటు చేయడంతో మహిళలు,



మద్యంషాపు తొలగించాలని ఆందోళన చేస్తున్న మహిళలు

జెడ్పి స్కూల్ విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. బంగ్లా కాలనీలో రేషన్‌దుకాణాన్ని ఏర్పాటు చేయాలని, జన్మభూమి కమిటీలను రద్దు చేయాలన్నారు. జన్మభూమిలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. గ్రామేతరులకు ఇంటిస్థలాలు, పొలం పట్టాపాసుపుస్తకాలిచ్చి అర్హులకు అన్యాయం చేశారన్నారు. ఒకే కుటుంబానికి చెందిన వారికి మూడు నాలుగు ప్లాట్లు ఇచ్చారని దీనిపై విచారణ చేసి అర్హులైనవారికి కేటాయించాలని డిమాండ్ చేశారు. టిడిపి పాణ్యం ఇన్‌ఛార్జి ఏరాసు ప్రతాప్‌రెడ్డి స్పందించి ఎక్సైజ్ సిఐ పద్మావతిని అక్కడికి పిలిపించి సమస్యపై దృష్టి సారించాలని ఆదేశించారు. సిఐ మాట్లాడుతూ ఈ విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి వారంలోగా వేరే ప్రాంతానికి తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్సైజ్ సిఐ హామితో మహిళలు, సిపిఎం నాయకులు ఆందోళన విరమించారు.

సిపిఎం మహాసభలను విజయవంతం చేయండి

గూడురు రూరల్ : ఆలూరులో ఈ నెల 10, 11, 12వ తేదిల్లో జరిగే సిపిఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సి.బెళగల్, గూడురు మండల ప్రాంతీయ కార్యదర్శి మోహన్ అన్నారు. శనివారం సిపిఎం పట్టణ కార్యదర్శి రాజశేఖర్ మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న ప్రజాసమస్యలపై మహాసభలలో చర్చించి పరిష్కారానికి తీర్మానాలు చేస్తారని అన్నారు. అనంతరం రాజశేఖర్ మాట్లాడుతూ సిపిఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కార్యకర్తలను, నాయకులను కోరారు. సిఐటియు మండలాధ్యక్షుడు రాజు, హమాలీ సంఘం నాయకుడు మునెప్ప, సుధాకర్, రంగన్న, జేమ్స్, దేవదానం, సుధాకర్, దేవరాజు, మాధవరంగడు, పాల్గొన్నారు.

జన్మభూమి ఎవరి కోసం..? : వైసిపి

ప్రజాశక్తి - కర్నూలు సిటీ

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమం ప్రజలకోసమా లేక టిడిపి అభివృద్ధి కోసమా వైసిపి నేతలు బివై రామయ్య, ఐజయ్య ధ్వజమెత్తారు. శనివారం స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కర్నూలు పార్లమెంట్ ఆధ్యక్షులు బివై రామయ్య, నందికోట్కూర్ ఎమ్మెల్యే వై.ఐజయ్య మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 25 సార్లు జిల్లాకు వచ్చి ఏం ఒరగపెట్టారని ప్రశ్నించారు. అప్పటి సిఎం రాజశేఖర్‌రెడ్డి చేసిన ప్రాజెక్టులను ప్రస్తుత సిఎం గేట్లను ఎత్తడానికి మాత్రమే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న పాదయాత్రకు వస్తున్న ఆదరణను చూసి అధికారపార్టీ నేతలకు భయం పుట్టుకుందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు వైసిపిని ఆదరిస్తారని పేర్కొన్నారు. నాయకులు కర్నాటి పుల్లారెడ్డి, సాంబశివారెడ్డి, మధుయాదవ్, పర్ల శ్రీధర్‌రెడ్డి, విజయకుమారి, ధనుంజయాచారి పాల్గొన్నారు.

మైక్యూర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

కోడుమూరు :మండలంలోని అమడగుంట్ల గ్రామంలో మైక్యూర్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. డాక్టర్ వెంకటేష్ ఆధ్వర్యంలో 90 మంది రోగులకు బిపి, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ మైక్యూర్ హాస్పటల్‌లో అన్ని రకాల వైద్యసేవలను అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఎంప్లాయిస్ స్కీమ్, ఆర్యోశ్రీ పథకం కింద నగదు రహిత వైద్య సేవలు అందజేస్తున్నట్లు చెప్పారు. హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

డిఇఒపై విచారణ కొనసాగించాలని ఉత్తర్వులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లా విద్యాశాఖ అధికారి తాహెరాసుల్తానాపై విచారణ కొనసాగించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్ఎల్‌టిఎ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్‌షావలి పేర్కొన్నారు. డిఇఒ తాహెరాసుల్తానా బిసి–బి కేటగిరి కింద విద్యాభ్యాసాన్ని కొనసాగించారన్నారు. అయితే ఉద్యోగంలోకి వచ్చిన పరిస్థితి ఉందని, అందుకే ఈ విషయంపై హైకోర్టులో రిట్ పిటిషన్ కూడా దాఖలు చేశామని తెలిపారు. మరో రెండు వారాల్లో ఈ కేసుపై హైకోర్టులో కూడా విచారణ జరుగుతుందని పేర్కొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : ఏరాసు

కల్లూరు, పందిపాడు, లక్ష్మీపురం గ్రామాల్లో సమస్యలపై అధికారులను నిలదీసిన సిపిఎం



సభలో మాట్లాడుతున్న ఏరాసుప్రతాప్‌రెడ్డి

ప్రజాశక్తి - ఓర్వకల్లు

నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికే సాధ్యమని టిడిపి పాణ్యం నియోజికవర్గ ఇంచార్జ్, మాజీ మంత్రి ఏరాసుప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని నన్నూరు, మీదివేముల గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. నన్నూరులో సర్పంచి చెన్నారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఏరాసుప్రతాప్‌రెడ్డి, మండల నోడల్ అధికారి, డిఇఒ తాహెరాసుల్తానా, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ప్రధాన కార్యదర్శి అస్లాంబేగ్‌లు హాజరయ్యారు. అంతకుముందు గ్రామంలో తాగునీటి వసతి కోసం 90 వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి ఏరాసు ప్రతాప్‌రెడ్డి భూమి పూజ చేశారు. అనంతరం గ్రామచావిడి దగ్గర జరిగిన కార్యక్రమంలో సర్పంచి చెన్నారెడ్డి పలు సమస్యలను ఏరాసు దృష్టికి తీసుకెళ్లారు. తహశీల్దార్ రజనీకుమారి, ఎంపిడిఒ మాధవీలత, ఎఒ మధుమతి, పశువైద్యులు మనోజ్‌కుమార్, హౌసింగ్‌ఎఇ నాగభూషణరావు, పిఆర్‌ఎఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్‌క్ట్రికల్ ఎఇ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, నాయకులు ఏరాసు రాజశేఖర్‌రెడ్డి, బి.ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రిష్ణగిరి : గ్రామంలో పింఛన్, రేషన్‌కార్డు , ఇతర సమస్యలు ఉన్న వారందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మండల నోడల్ అధికారి రఘునాథ్‌రెడ్డి, ఎంపిడిఒ మురళీ మోహన్‌మూర్తి పేర్కొన్నారు. మండలంలోని పోతుగల్లు, అగవేలి గ్రామాల్లో సర్పంచుల అధ్యక్షతన జన్మభూమి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు సమస్యలపై అధికారులను నిలదీశారు. జడ్పిటిసి మాజీ సభ్యుడు కెఇ.జయన్న, ఎంపిడిఒ మురళీమోహన్‌మూర్తి, తహశీల్దార్ రామసుబ్బయ్య, సర్పంచు వెంకటేశ్వరమ్మ, అన్ని శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గూడురు రూరల్ : తనను బలహీనపరిచేందుకు, ప్రజల్లో చెడ్డపేరు తెచ్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, వారి ప్రయత్నాలు, కుట్రలను ప్రజాబలంతో తిప్పికొడతామని టిడిపి కోడుమూరు నియోజకవర్గ ఇంచార్జీ విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఆర్.కానాపురంలో జరిగిన కార్యక్రమంలో నోడల్ అధికారి కళ్యాణం పాల్గొని మాట్లాడారు. ఎంపిపి ఈశ్వరమ్మ, సర్పంచు మద్దిలేటి, తహశీల్దార్ శివశంకర్‌నాయక్, ఎపిఒ శ్రీనివాస్‌గౌడు, మాజీ జడ్పిటిసి సభ్యుడు వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపిపి కరుణాకర్‌రాజు పాల్గొన్నారు.

నేడు జన్మభూమి సందర్భంగా 5కె రన్ కార్యక్రమం

కోడుమూరు : నేడు ఆదివారం జన్మభూమి కార్యక్రమం సందర్భంగా కోడుమూరు పట్టణంలోని అన్ని ప్రభుత్వ , ప్రవేటు ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఉదయం 7 గంటలకు 5కె రన్ కార్యక్రమం ఉంటుందని మండల విద్యాధికారి అనంతయ్య తెలిపారు. పాతబస్టాండ్‌లోని కోట్లసర్కిల్ దగ్గర నుండి ప్రభుత్వ వైద్యశాల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు.

సి.బెళగల్ : మండలంలోని గుండ్రేవుల గ్రామంలో ఎంపిడిఒ సిద్ధలింగమూర్తి, ఇఒఆర్‌డి సుమిత్రమ్మ అధ్యక్షతన జన్మభూమి నిర్వహించారు. నోడల్ ఆఫీసర్ ప్రసాద్‌రావు హాజరై మాట్లాడారు. ఫించన్లకు, రేషన్‌కార్డులకు ప్రజలు అధిక మొత్తంలో అర్జీలు అందజేశారు. గుండ్రేవులకు ఇనగండ్ల మీదుగా బస్సు నడపాలని వినతి గ్రామస్తులు అధికారులకు విన్నవించారు. అనంతరం ఆర్‌టిసి గైడ్‌స్టాఫ్ నజీర్ వినతి పత్రం అందజేశారు. తహశీల్దార్ అన్వర్‌హుస్సేన్, ఎఒ సురేష్‌రెడ్డి, ఎంఇఒ జ్యోతి, ఎపిఎం జయశ్రీ, విద్యుత్ ఎఇ వినోద్‌బాబు, సర్పంచు సుజనప్రియ, కార్యదర్శులు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

వెల్దుర్తి రూరల్ : టిడిపి ప్రభుత్వంలో నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపిపి శైలజాసుబ్బరాయుడు అన్నారు. మండలంలోని రామళ్లకోట, గోవర్ధనగిరి గ్రామాల్లో తహశీల్దార్ రామాంజులు నాయక్, ఎంపిడిఒ అబ్దుల్‌వహీద్‌ల ఆధ్వర్యంలో జన్మభూమి నిర్వహించారు. రేషన్‌కార్డులు, పెన్షన్లు, సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. అనంతరం నోడల్ అధికారిని జుబేదాబేగం మట్లాడారు. ఎఒ రవిప్రకాష్, పశువైద్యాధికారిని జానకి, వెలుగు ఏపిఎం కాశీశ్వరుడు, యుఒఆర్డీ మహుభూబ్‌ఖాన్, సర్పంచులు వీరమ్మ, ఆరుణావతమ్మ, టిడిపి నాయకులు రామక్రిష్ణ ఆచారి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


కల్లూరు ప్రాంతంలో ప్రతి రోజూ నీరు వదలాలి : సిపిఎం

కర్నూలు కార్పొరేషన్ : కల్లూరు ప్రాంతంలోని కాలనీలకు ప్రతిరోజూ తాగునీరు అందించాలని సిపిఎం కర్నూలు న్యూసిటీ కార్యదర్శి టి.రాముడు 32వ వార్డు కల్లూరులో జరిగిన జన్మభూమి సభలో అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు రాముడు, రమణమూర్తి, గోవిందు 32వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. శ్రీనివాసలు, గోవిందు, స్వామిశేఖర్, సూర్యనారాయణ, ధనుంజయలు పాల్గొన్నారు.

31వ వార్డులో: పందిపాడులోని ఇందిరమ్మ ఇళ్లకు మౌళిక వసతులు కల్పించాలని, రుణాల మంజూరు, స్థానిక సమస్యలు పరిష్కరించాలని సిపిఎం వార్డు కార్యదర్శి కె.సుధాకరప్ప, మహిళానాయకురాలు ఓబులమ్మ, ప్రజలు జన్మభూమిలో అధికారులను నిలదీశారు. అనంతరం నోడల్ అధికారి రమణమూర్తికి వినతి పత్రం అందజేశారు. బి.ఆజాద్, బషీర్, చిన్న, సుధాకర్, ఇస్మాయిల్, కృష్ణ, నాగేశ్వర్‌రావు, దానమ్మ, కన్యకా, శారదమ్మ, ఈశ్వరయ్య పాల్గోన్నారు.

పట్టాలు రద్దు చేసి ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : దూపాడు గ్రామంలో 139 సర్వే నెంబర్‌లో ప్రభుత్వ భూమిని గ్రామేతరులకు కట్టబెట్టిన పట్టాలను రద్దు చేసి ఆ గ్రామప్రజలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని సిపిఎం కల్లూరు మండల కార్యదర్శి కె.వెంకటరాముడు డిమాండ్ చేశారు. దూపాడు గ్రామ ప్రజలు లక్ష్మీపురంలో జరుగుతున్న జన్మభూమి కార్యక్రమానికి ర్యాలీగా వెళ్లి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కె.వెంకటరాముడు, బి.సోమన్న మాట్లాడుతూ గ్రామంలో లేని వారికి పట్టాలు ఇచ్చి ఆన్‌లైన్ ఎలా చేశారో అలాగే వాటిని వెంటనే రద్దుచేసి గ్రామంలో ఉన్న వారికే ఇవ్వాలన్నారు. అధికారులు స్పందించి తహశీల్దార్, ఆర్‌డిఒ, జెసి దృష్టికి తీసుకెళ్లి అక్రమంగా ఇచ్చిన పట్టాలను రద్దు చేసి పేదలకు ఇస్తామని హామీనిచ్చారు.

గంజాగుపై బ్రిడ్జి నిర్మించాలి : లక్ష్మీపురం గ్రామంలో గంజాగుపై బ్రిడ్జి నిర్మించాలని, హంద్రీనది వెంట డ్రైనేజీ కాల్వలను నిర్మించాలని అధికారులకు వినతి పత్రం అందజేశారు. దూపాడు గ్రామ కార్యదర్శి ఆంజనేయులు, స్థానిక నాయకులు మౌళిరాజు, మద్దిలేటి, శివన్న, గాలెన్న, తిరుమల్, దామోదర్‌రెడ్డి, నరసింహులు, జానకమ్మ, లక్ష్మీదేవి, మద్దమ్మ, మంగమ్మ, లక్ష్మీపురం గ్రామ కార్యదర్శి ఆంజనేయులు, మాజీ ఎంపిటిసి ఆంజనేయులు, భాస్కర్‌రెడ్డి, రామకృష్ణరెడ్డి, పక్కీరన్న పాల్గొన్నారు.



కల్లూరులో జరిగిన కార్యక్రమంలో సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తున్న సిపిఎం నాయకులు



లక్ష్మీపురంలో అధికారులకు వినతి ఇస్తున్న సిపిఎం నాయకులు


పత్రాలను అందజేస్తున్న వెంకట కృష్ణారెడ్డి

టిడిపితోనే అభివృద్ధి

ప్రజాశక్తి - గడివేముల

టిడిపి ప్రభుత్వ పాలనలోనే అభివృద్ధి సాధ్యమని చిందుకూరు గ్రామ సర్పంచి వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. చిందుకూరు, గడిగరేవుల గ్రామాల్లో శనివారం జన్మభూమి – మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో లోటు బడ్జెట్‌లో ఉన్న సిఎం వెనకడుగు వేయకుండా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. అర్హులైన నిరుపేద లందరూ పింఛను, గృహ నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని కోరారు. గడిగరేవుల సర్పంచి నరసింహుడు, ఎంపిపి పద్మావతి, తహశీల్దార్ వెంకటేష్ నాయక్, ఎంపిడిఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

బైక్ చోరీ

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఇంటిముందు నిలిపి ఉన్న బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని సిఐ దేగల ప్రభాకర్ చెప్పారు. శనివారం ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కల్లూరుకు చెందిన జయరాముడు తన బజాజ్ పల్సర్ 150 సిసి బైక్‌ను టీచర్స్ కాలనీలో ఉన్న తన స్నేహితుడు రామ్‌నాథ్‌రెడ్డి ఇంటి ముందు పార్క్ చేసి ఉంచాడు. శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చోరీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ తెలిపారు.

వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

ఓర్వకల్లు మండలం హుస్సేనాపురం గ్రామ సమీపాన 44 వ నెంబర్ జాతీయ రహదారి పక్కన శుక్రవారం రాత్రి ఓ వృద్ధుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ హత్యోదంతం శనివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాలకొలను మజారా గ్రామమైన చింతలపల్లె గ్రామానికి చెందిన వడ్డె ఎల్లస్వామి(65) శుక్రవారం చింతలపల్లె నుంచి వృద్ధాప్య పెన్షన్ తీసుకుని హుస్సేనాపురం గ్రామంలో ఉన్న తన ఏకైక కుమారుడు వడ్డె లక్ష్మీకాంత్ ఇంటికి వచ్చి సాయంత్రం తన గ్రామానికి తిరుగు పయనమయ్యాడు. శనివారం ఉదయం ఓ చెట్టు వద్ద హత్యకు గురై విగతజీవి వలే పడి ఉన్నాడు. స్థానికుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న ఓర్వకల్లు పోలీసు స్టేషన్ ఎస్ఐ చంద్రబాబునాయుడు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. రూరల్ సిఐ నాగరాజుయాదవ్ సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్ సంఘటనా స్థలానికి రప్పించి ఆధారాలు సేకరించారు. టౌన్ డీఎస్పీ ఎస్ ఖాదర్‌బాషా ఆదేశాల మేరకు దర్యాప్తును వేగవంతం చేసినట్లు ఎస్ఐ చంద్రబాబు నాయుడు తెలిపారు. మృతి చెందిన వడ్డె ఎల్లస్వామిని శుక్రవారం సాయంత్రం వైన్‌షాపు సమీపంలో చూశామని కొంతమంది పోలీసులకు తెలిపారు. హత్యకు గురైన చెట్టు వద్ద ఎల్లస్వామి ఓ వ్యక్తితో కలిసి కూర్చోవడం చూశామని కొందరూ పోలీసులకు తెలిపారు. మృతునితో పాటు ఉన్న అదే గ్రామానికి చెందిన జంగాల వెంకటస్వామిని పోలీసులు అనుమానం కింద అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తన భర్తకు ఎవరితోనూ వైరం లేదని, విరోధులు ఎవరూ లేరని భార్య వడ్డె లక్ష్మీదేవి కన్నీరుమున్నీరైంది. అటువంటి వ్యక్తిని అంత దారుణంగా చంపాల్సిన అవసరం ఎవరికుందని కుటుంబ సభ్యులతో పాటు పోలీసులు తీవ్రంగా విచారిస్తున్నారు. మిస్టరీగా మారిన వడ్డె ఎల్లస్వామి హత్య కేసును త్వరలోనే ఛేదిస్తామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

ఘనంగా సావిత్రిబాయిపూలే జయంతోత్సవాలు

ప్రజాశక్తి వెల్దుర్తి

సావిత్రిబాయిపూలే జయంతోత్సవాలను స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.ఎం.జయరాజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయిపూలే ఒక వ్యక్తి కాదు, ఒక వ్యవస్థ అన్నారు. సామాజిక కట్టుబాట్లను తెంచుకొని ఆధునిక భావాలకు అంకురార్పణ చేసింది. ఆమె ఒక గొప్ప సామాజిక విప్లవవాది అని, మహిళా లోకానికి మాణిక్యం అన్నారు. స్థానిక బాలికల విద్యకోసం అహర్నిశలు కృషి చేసి ఒక కొత్త వ్యవస్థను సామాజానికి అందించిదన్నారు. ఎన్నో ఒడిదుడుకులను తట్టుకొని మహిళా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లింది. ఆమె ఆదర్శాలను ప్రేరణగా తీసుకొని మహిళలంతా సమాజంలో చైతన్యం తీసుకురావాలన్నారు. మండల విద్యా శాఖాధికారి


సమావేశంలో మాట్లాడుతున్న కె.సురేష్

ఇందిర, కస్తూర్బాగాంధీ పాఠశాల ప్రిన్సిపల్ మంజుల. యుటిఎఫ్ మండల కార్యదర్శి మద్దిలేటి, ప్రధాన కార్యదర్శి మద్దిలేటి స్వామి, అధ్యక్షులు రవికుమార్, నారాయణరెడ్డి, మద్దిలేటి, నాగేంద్రయ్య, హేమంత్ కుమార్, నాయకులు ప్రభావతి, విజయకుమారి, వనజ కుమారి, మేరిఫ్లారేన్స్, మద్దిలేటి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎపిజిబి మేనేజర్ సజీవ దహనం

గ్యాస్ లీకేజీతో కారు దగ్ధం

ప్రజాశక్తి - బనగానపల్లె

కర్నూలు జిల్లా బనగానపల్లె మండలంలోని దద్దణాల ప్రాజెక్టు సమీపంలో కారులో మంటలు చెలరేగి ఆంధ్రాప్రగతి గ్రామీణ బ్యాంకు గార్లదిన్నె మేనేజర్ రాజేష్ (30) సజీవ దహనమయ్యారు. వివరాలిలా ఉన్నాయి... శనివారం నంద్యాల నుంచి మేనేజర్ రాజేష్ కారులో గార్లదిన్నెకు బయల్దేరారు. మార్గమధ్యంలో దద్దణాల ప్రాజెక్టు సమీపంలో కారులో గ్యాస్ లీకేజీతో మంటలు చెలరేగాయి. మేనేజర్ రాజేష్ కారులోనే ఇరుక్కుపోయారు. కారులో మంటలు చెలరేగడం గమనించిన ద్విచక్ర వాహన చోదకులు, ఇతర ప్రయాణికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు అదుపు కాలేదు. కారులో ఇరుక్కున్న మేనేజర్ రాజేష్ సజీవ దహనమయ్యారు. శరీరమంతా కాలి పోయి తలపుర్రె, ఎముకలు మాత్రమే మిగిలాయి. ప్రయాణికులు పోలీసులకు సమాచారం రావడంతో సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ రాకేష్ సంఘటనా స్థలానికి చేరుకుని కారు ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు. బనగానపల్లె అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలను ఆర్పారు. అప్పటికే బ్యాంకు మేనేజర్ పూర్తిగా కాలి బూడిదయ్యారు. మృతుడికి భార్య సాహిత్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శ్రీనివాసులు తెలిపారు.

ప్యాపిలి : బ్యాంకు మేనేజర్ రాజేష్ మృతి విషయం తెలిసిన వెంటనే ప్యాపిలి మండలం గార్లదిన్నె, మాధవరం, బూరుగల, నేరెడుచర్ల గ్రామాల ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బ్యాంకు మేనేజర్ ఆయా గ్రామాలకు సుపరిచితులు. జిల్లా గొర్రెలపెంపకందారుల సంఘం అధ్యక్షులు నాగేశ్వరరావు యాదవ్, మాజీ ఎంపిపి టి.శ్రీనివాసులు, విఆర్ఓ మల్లారెడ్డి, రామ్మోహన్ యాదవ్, గండికోట సుబ్బయ్య మాట్లాడారు. రాజేష్ మృతి చాలా దురదృష్టకరమని, ప్రజలకు, రైతులకు బ్యాంకు సేవలు అందించారని తెలిపారు.

భర్తపై హత్యాయత్నం కేసు నమోదు

ప్రజాశక్తి - శిరువెళ్ల

శిరువెళ్ల మండలం గుంప్రమానుదిన్నె గ్రామంలో కట్టుకున్న భార్యను కడతేర్చేందుకు ప్రయత్నించిన భర్తపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. రాత్రి నిద్రిస్తున్న సమయంలో ఇతర మహిళ వలలో పడ్డ తన భర్త గొంతుపై కత్తి పెట్టి కోసి చంపేందుకు ప్రయత్ని ంచినట్లు నాగశేషమ్మ ఫిర్యాదు చేయడంతో భర్త నాగసుబ్బరాయుడుపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కెసి కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహం

ఆళ్లగడ్డ రూరల్ : పట్టణానికి సమీపంలో ఉన్న కెసి కెనాల్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పట్టణ ఎఎస్ఐ పాపయ్య తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వ్యక్తి వయస్సు 45 సంవత్సరాలు ఉండవచ్చన్నారు. మృతదేహం పూర్తిగా కుళ్ళిపోయి ఉండడంతో గుర్తుపట్టడానికి వీల్లేని విధంగా ఉందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తిపై దాడి - ఐదుగురిపై కేసు నమోదు : ఆర్‌కృష్ణాపురం గ్రామంలో వ్యక్తిపై దాడి చేసిన కేసులో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ రామయ్య తెలిపారు. గ్రామానికి చెందిన సహదేవరెడ్డిపై అదే గ్రామానికి చెందిన పాతకక్షలు మనసులో ఉంచుకొన్న సోము సుబ్బరాయుడు, సురేష్‌లు, ప్రకాష్‌తో పాటు మరో ఇద్దరు కలిసి దాడికి పాల్పడ్డారు. సహదేవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కంది పంట దొంగలు అరెస్టు

ప్రజాశక్తి - వెల్దుర్తి రూరల్

వెల్దుర్తి మండలం రత్నపల్లె గ్రామంలో కందిపంటను నాలుగు రోజుల కిందట ఎత్తుకెళ్లిన సంగతి విదితమే. గ్రామానికి చెందిన హరిజన పెద్దఅయ్యమ్మ చేసులో అదే గ్రామానికి చెందిన పెద్దరాముడు, రామ్‌పుల్లయ్య, చిన్నరాముడు, శ్రీరాములు, నాగరాజు, కొత్తూరు నాగన్నలపై స్థానిక పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేయగా నేరం రుజువు కావడంతో డోన్ కోర్టులో హాజరు పరుచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ ఖాజావలి తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం ఉదయం నగరంలో వెలుగుచూసింది. రైల్వే పోలీసు స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం ఉదయం స్థానిక స్విమ్మింగ్ పూల్ సమీపంలోని 244/ 5-6 కిలోమీటర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడన్న సమాచారంతో సంఘటనా స్థలానికి వెళ్లాము. మృతునికి 55 సంవత్సరాల వయస్సు ఉండవచ్చు. తెల్లగడ్డం ఉంది. తెల్లని పంచె, తెల్లని ఫుల్‌హ్యాండ్స్ అంగీ వేసుకున్నాడు. రాత్రి గుర్తు తెలియని రైలు ఢీకొని ఉండవచ్చని, ఆచూకీ తెలిసిన వారు కర్నూలు రైల్వే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

మట్కా బీటర్ అరెస్టు

బేతంచర్ల : బేతంచర్ల పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలో మట్కా నిర్వహిస్తున్నారన్నా సమాచారం మేరకు దాడులు చేసి క్లైప మురళీ ధర్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిరుపాలు తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సమాచారం మేరకు దాడులు చేయగా క్లైప మురళీధర్‌రెడ్డి అనే వ్యక్తి దగ్గర మట్కా చిటీలు, రూ63,400 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కానిస్టేబుళ్లు జనార్ధన్‌రాజు, తిరుమలేష్, యశోద పాల్గొన్నారు.

21 వాహనాలకు జరిమానా

కర్నూలు క్రైం : సరైన ధృవపత్రాలు లేకుండా తిరుగుతున్న 21 వాహనాలను గుర్తించి రూ. 5,235 జరిమానా విధించామని ఉలిందకొండ ఎస్ఐ డి వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం ఉలిందకొండ గ్రామంలో నిర్వహించిన వాహనాల తనిఖీలలో సరైన ధృవపత్రాలు లేని వాహనాలను గుర్తించి 21 మందిపై మోటార్ వెహికిల్ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేసి జరిమానా విధించామని ఎస్ఐ తెలిపారు.

ముఖ్యమంత్రి రాక సందర్భంగా పనులు వేగవంతం

ప్రజాశక్తి-ఆత్మకూరు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆత్మకూరు మండలంలోని సిద్ధాపురం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభోత్సవంలో ఆదివారం పాల్గొంటారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు ఆత్మకూరులో ఉండి యుద్ధప్రాతిపదికన పనులను చేయిస్తున్నారు. శనివారం పంప్‌హౌస్‌కు సంబంధించిన శిలా ఫలకాన్ని చెరువు కట్టపైనే నిర్మించే పనిలో పడ్డారు. చెరువు కట్ట పైభాగంలో బిలుకు, చిప్స్ వేసి వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు వెంకటాపురం నుంచి బైర్లూటి వరకూ కెజి రోడ్డుకు ఇరువైపులా గుంతలను పూడ్చుతున్నారు. హెలిప్యాడ్ నిర్మాణ పనులు, సభావేదిక పనులు కెజి రోడ్డు నుంచి సభావేదికకు వెళ్లేందుకు సిద్ధాపురం చెరువు కట్ట కింద భాగాన బిలుకు రోడ్డును యుద్ధప్రాతిపదికన అధికారులు దగ్గరుండి చేయిస్తున్నారు. మరోవైపు సిద్ధాపురం చెరువు కట్ట నుంఎతీ స్టేజ్-2



పంప్‌హౌస్ వరకూ వెళ్లేందుకు బిలుకు మురుసు రోడ్డును అధికారులు దగ్గరుండి వేయిస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వాధికారులు, ఇంజినీర్లు పనులు చేయిస్తుండగా మరోవైపు టిడిపి కార్యకర్తలు చెరువు కట్టపై ఫ్లెక్సీలు, స్వాగత బ్యానర్లు చెరువు కింది భాగంలో ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు పోలీసు ఉన్నతాధికారులు, పోలీసులు చంద్రబాబు బందోబస్తు నిమిత్తం తరలివచ్చారు. బాబు పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

జన సమీకరణకు టిడిపి కృషి

సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించేందుకు హాజరవుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ కృషి చేస్తున్నారు. ప్రతి గ్రామం నుంచి అందుబాటులో ఉన్న ట్రాక్టర్లు, ఆటోలు, మోటారు సైకిళ్ల ద్వారా జన సమీకరణ చేయాలని ఆదేశించారు. మండల స్థాయి నాయకులు గ్రామాల్లో పర్యటిస్తూ పెద్దఎత్తున ప్రచారాలు చేస్తున్నారు. చంద్రబాబు బహిరంగ సభను దాదాపు 30 వేల మందితో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను చేశారు. ప్రతి గ్రామం నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలి వచ్చేందుకు కార్యకర్తలు ఏర్పాట్లు చేసుకున్నారు. మరోవైపు పొదుపు మహిళలు, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులను తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది.



క్రీడాకారులతో డాక్టర్ శంకర్ శర్మ

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్ : రాష్ట్రస్థాయి నాలుగో జూనియర్, సబ్ జూనియర్ కుస్తీ పోటీలకు జిల్లాస్థాయి క్రీడాకారులు ఎంపిక చేసినట్టు కర్నూలు జిల్లా అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాటెపోగు మల్లికార్జున తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ శంకర్ శర్మ, జగన్నాథరెడ్డి పాల్గొన్నారు. క్రీడాకారుల నుంచి డాక్టర్ గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాలో మొత్తం 60 మంది పాల్గొన్నారు. వారిలో 30 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైనవారు ఈనెల 10 నుంచి 12 ఒంగోలు .20 నుంచి 22 కడప రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పోలీస్ కోచ్‌ఆంజనేయులు రెఫరీ గా వ్యవహరించారు. జిల్లా కమిటీ ప్రతినిధి అబ్రహం లింకన్. వాడక్ అడ్వైజర్ రావుప్ పాల్గొన్నారు

శ్రీశైలంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు

శ్రీశైలం : శ్రీశైలం క్షేత్రంలోని భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లను కేంద్ర పర్యాటక శాఖ మంత్రి మహేష్ శర్మ, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ శనివారం దర్శించుకున్నారు. వీరిలో విడివిడిగా దర్శనానికి ఆలయం వద్దకు చేరుకున్నారు. ముందుగా కేంద్ర పర్యాటక శాఖ మంత్రి మహేష్‌శర్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. వీరికి ఇఒ భరత్‌గుప్త సాంప్రదాయ బద్ధంగా వేద మంత్రాలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం పలికారు. తర్వాత రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ ఆలయం వద్దకు చేరుకోగా ఇఒ స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా ఇఒ భరత్‌గుప్త జ్ఞాపికను అందజేశారు.



భర్త మందలించాడని భార్య ఆత్మహత్య

కర్నూలు క్రైం : భర్త మందలించాడని విషం తాగి ఆత్మహత్య చేసుకుంది ఓ భార్య. ఉలిందకొండ ఎస్ఐ డి.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొంగనపాడు గ్రామానికి చెందిన తెలుగు నాగేంద్రమ్మ (38) ఈ నెల 4న తన భర్త అయిన లక్ష్మన్న జొన్నపంటకు కూలీలను పిలువ లేదని, నీకు పని ఏమీ చేతకాదని పొలంలో అందరి ముందూ తిట్టడంతో మనస్థాపం చెంది గుర్తు తెలియని విషం తీసుకుంది. కోలుకోలేక శుక్రవారం రాత్రి మృతి చెందింది. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

మొదటి పేజీ తరువాయి...

కమిటీ సభ్యులు వి.వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారన్నారు. ఈ సభ ఒక ప్రత్యేక సమయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతపురం తర్వాత కర్నూలు జిల్లాలో అత్యంత వెనుకబడిన ఆలూరు, పత్తికొండలో సాగు, తాగునీరు లేక, పంటలు పండక, ఉపాధి లేక 20 ఎకరాలు పొలం ఉన్న రైతులు కూడా వలసలు వెళ్లే పరిస్థితి ఉందన్నారు. ఆ ప్రాంతాల ప్రజల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ సభలో చర్చించి తీర్మానాలు చేసి పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు. 2016 మేలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలూరు మండలంలోని కురవడి గ్రామంలో నీరు-చెట్టు సభలో పాల్గొని ఎస్ఆర్‌బిసి కాల్వ ద్వారా హంద్రీనీవా నుంచి తూము ఏర్పాటు చేసి 15 వేల ఎకరాలకు సాగునీరందించేందుకు రూ.2 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారని చెప్పారు. ఇప్పటిదాకా ఆ పనులు చేపట్టలేదన్నారు. వేదవతి, తుంగభద్ర నుంచి 60 టిఎంసిల నీరు వర్షాకాలంలో వృథాగా సముద్రంలో కలుస్తోందని తెలిపారు. ఆ నీటిలో కనీసం 10 టిఎంసిల నీరు వినియోగించు కున్నా 80 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చని అన్నారు. వేదవతి, నగరడోణ రిజర్వాయర్లు 2008లోనే నిర్మించేందుకు 600 ఎకరాల భూమి కేటాయించారని తెలిపారు. అప్పుడు రూ.30 కోట్లతో పూర్తయ్యేదని, నేడు రూ.150 కోట్లకు చేరిందని చెప్పారు. 14 గ్రామాలకు సాగు, తాగునీరు సమస్యలు వాటి వల్ల పరిష్కారమవుతాయని తెలిపారు. దేవరగట్టు వద్ద జింకల పార్కు ఏర్పాటు చేస్తామన్నారని, ఇంతవరకూ నోచుకోలేదని చెప్పారు. ఆ ప్రాంత ప్రజలు వేసుకున్న పంటలను జింకలు తినకుండా కాపలా కాస్తున్నారని తెలిపారు. ఈ మహాసభల్లో 2015-18 వరకూ జరిగిన పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకుంటామని చెప్పారు. రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, గుండ్రేవుల, ఆర్‌డిఎస్ కుడికాల్వ ఎత్తిపోతల పథకాలు, కర్నూలు ప్రభుత్వాస్పత్రిని ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి, అమరావతికి నేరుగా రైలు మార్గం, మంత్రాలయం నుంచి కర్నూలు రోడ్డు, రైలు మార్గాలు, ఇస్కాల, చెలిమెల్ల, పులికనుమ, పులకుర్తి ఎత్తిపోతల పథకాలు, ఇందిరమ్మ గృహాలు తదితర అంశాలపై చర్చించి రాబోవు కాలంలో ప్రజా ఉద్యమాలకు ఈ మహాసభలు వేదిక కానున్నాయన్నారు. ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు హాజరయి జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు పాల్గొన్నారు.

నేడు సిద్ధాపురానికి ముఖ్యమంత్రి రాక

ప్రజాశక్తి - కర్నూలుకలెక్టరేట్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివారం జిల్లా పర్యటనకు రానున్నారు. ఆత్మకూరు మండలంలోని సిద్ధాపురం గ్రామంలో జరిగే జన్మభూమి కార్యక్రమంలో పాల్గొంటారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మధ్యాహ్నం 12 గంటలకు సిద్ధాపురం చేరుకుంటారు. 12.15 గంటలకు సిద్ధాపురం ఎత్తిపోతల ప్రారంభోత్సవం, జలహారతి కార్యక్రమం నిర్వహణతోపాటు మధ్యాహ్నం 12.45 గంటలకు గ్రామసభను నిర్వహిస్తారు. అనంతరం 12.45 గంటల నుంచి 1.38 గంటల వరకూ అక్కడే మధ్యాహ్న భోజనం చేసి కొంత సేపు సేద తీరుతారు. 1.30 నుంచి 1.45 గంటల వరకూ అక్కడే ఏర్పాటు చేసిన పలు శంకుస్థాపనలు చేస్తారు. మైనార్టీ సంక్షేమ శాఖ కింద చేపట్టే అభివృద్ధి పనులకు, ఆత్మకూరు 4 వేల ఇళ్ల సముదాయాలకు, రైతుబజార్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం 2గంటలకు జన్మభూమిలో పాల్గొని మాట్లాడారు. సాయంత్రం 4.45 గంటలకు సిద్ధాపురం నుంచి పర్యటన ముగించుకుని బయల్దేరి వెళ్తారు.

కరువుకేసి చూడండి

మొదటి పేజీ తరువాయి...

పరిశ్రమ మినహా ఒక్క పరిశ్రమా రాని పరిస్థితి ఉంది. సోలార్ పరిశ్రమ వచ్చినా అందులో ఉపాధి అన్నది శూన్యం. టూరిజం సర్క్యూట్, హంద్రీనీవా వెంట ఉండే కాల్వలకు నీరు నింపడం వంటి పనులు అటకెక్కాయి. జింకల పార్కును మూసేశారు. ఇప్పటిదాకా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల్లో కార్యరూపం దాల్చనివే ఎక్కువగా ఉండడం పట్ల జిల్లా ప్రజలు ముఖ్యమంత్రి పర్యటన ఉందంటే పెదవి విరుస్తున్న పరిస్థితి నెలకొంది. గతేడాది అక్టోబర్‌లో కురిసిన వర్షాలకు జిల్లా రైతులకు కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. రైతులకు నష్టపరిహారం ఇచ్చే విషయంలో ప్రభుత్వం ఇప్పటిదాకా చర్యలు తీసుకోకపోవడం పట్ల రైతులు నిరాశతో ఉంది. మొత్తంగా రాజకీయ ప్రయోజనాల కోసమే జిల్లాకు ముఖ్యమంత్రి రావడం తప్ప జిల్లా అభివృద్ధికి ఒనగూరే ప్రయోజనాలు సిఎం పర్యటనతో ఏమీ లేవనేది ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. కనీసం ఈ పర్యటనలోనైనా జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టుల పనులపై నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు పోవాల్సిన అవసరం ఉందని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాలపై నిర్లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

అధ్యక్షులు కెఎన్‌వి.రాజశేఖర్, జెవివి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రవికుమార్, కె.శ్రీనివాసులు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.సురేష్‌కుమార్ హాజరయ్యారు. ఆయా జిల్లాల నుంచి ఎంపికైన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెవివి జెండాను ఆవిష్కరించి అనంతరం సైన్స్ సంబరాలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి డాక్టర్ మోహన్‌రావు మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా శాస్త్ర, సాంకేతిక రంగం విస్తరిస్తోందని తెలిపారు. భారతదేశంలోనూ ఈ రంగం అభివృద్ధి చెందుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం అందుకు తగిన విధంగా ప్రోత్సహించడం లేదన్నారు. నిధుల కేటాయింపుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. విద్యార్థులు ఇలాంటి సైన్స్ టాలెంట్ టెస్టు ద్వారా ఎంపిక కావడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు ఇప్పటినుంచే అభివృద్ధి చెందాలని చెప్పారు. నానో టెక్నాలజీ రోజురోజుకూ అభివృద్ధి చెందుతోందన్నారు. విద్యార్థులు ఇప్పటినుంచే శాస్త్ర, సాంకేతిక అంశాలపై దృష్టి సారించాలని కోరారు. అనంతరం మోటూరు కృష్ణప్రసాద్ మాట్లాడారు. విద్యార్థులకు ఇలాంటి వేదికలు ఎంతో



ఉపయోగపడతాయని తెలిపారు. సైన్స్‌కు సంబంధించిన అంశాలను మరింత తెలుసుకోవాలన్నారు. చెకుముకి నిర్వాహకులు రామచంద్రయ్య మాట్లాడుతూ... రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్టులో ఎంపికైన విద్యార్థులను ఈ సంబరాలకు ఎంపిక చేశామని తెలిపారు. విద్యార్థులకు మూడ్రోజులపాటు విజ్ఞానాన్ని పెంపొందించే అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ప్రతి విషయాన్ని జాగ్రత్తగా తెలుసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ... జెవివి ప్రతేడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. సైన్స్ అభివృద్ధిపై ఈ సంస్థ ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. కొత్త ఆవిష్కరణలపై విద్యార్థులను పరిశీలించాలని చెప్పారు. విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా మారేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్ శంకర్‌శర్మ, డాక్టర్ శ్రీహరి, కెఎన్‌వి.రాజశేఖర్ మాట్లాడుతూ... కర్నూలు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. జెవివి సైన్స్, మూఢనమ్మకాలు వంటి అంశాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తోందన్నారు. అనంతరం అక్కడే విద్యార్థులు, శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పలు అంశాలపై శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సెయింట్ జోసెఫ్ కళాశాల ప్రిన్సిపల్ శౌరీలురెడ్డి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన పలు ఎగ్జిబిషన్ స్టాల్స్ ఆకట్టుకున్నాయి. అలాగే మ్యాజిక్ షో కూడా నిర్వహించారు. జెవివి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాజాబాష, సత్యనారాయణరెడ్డి, ప్రొఫెసర్ బిఎన్.రెడ్డి, ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వరరావు, జెవివి రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రంగన్న, జెవివి సీనియర్ నాయకులు బిడి.సుధీర్‌రాజు, డాక్టర్ బడెసాహెబ్, జిల్లా నాయకులు జగదీష్, పలువురు రాష్ట్ర నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం



ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా నాయకులు ఎస్.మస్తాన్‌వలి, మండల కార్యదర్శి సద్దాం హుసేన్ డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించడంలో అధికారులు, ప్రభుత్వం విఫలం చెందారన్నారు. పేరుకు జిల్లా ఆస్పత్రి తప్ప ఆ స్థాయిలో వైద్యం అందించడం లేదని, ప్రభుత్వం కూడ తగిన నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం లేదన్నారు. ఆస్పత్రిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. మున్సిపల్ కమిషనర్ చొరవ తీసుకొని తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. మండల నాయకులు బంగారయ్య, ఆల్ఫోన్స్, శ్యామ్సన్, రాజేశ్వరి, యాసుఫ్, బాలుగ్రం, మద్దిలేటి, గ్రేసమ్మ, తిరుపతమ్మ, పుల్లన్న, వెంకటేష్, ఈశ్వరయ్య, ఆంతోని పాల్గొన్నారు.

చంద్రన్న కానుకలు పంపిణీ

ప్రజాశక్తి - చాగలమర్రి

రాష్ట్రంలోని ప్రజలు పండగలను ఆనందంగా నిర్వహించుకోవడానికి సిఎం అందిస్తున్న చంద్రన్న కానుకలను మాజీ సర్పంచి, టిడిపి నాయకులు ఎంఎస్ అన్సర్‌బాష శనివారం పంపిణీ చేవారు. చాగలమర్రిలోని పాతబస్టాండ్, చిన్నమకానంకాలనీ, 2వవార్డు లోని చౌక దుకాణాల్లో ఆయన చంద్రన్న కానుకలను నిరుపేదలకు అందజేశారు. నాయకులు ఎంసీఅమీర్, ఎంసీ మహబుబ్ బాషా, ఖాజరసూల్, ముల్లాషాబుల్, గంగుల ప్రతాప్, గంగులభాస్కర్, నాగుర్‌బాషా, అబ్దుల్లా, మాబులాల్, నూర్‌బాషా, రహీమ్, ఇమాంహుసేన్, ముల్లాఅజీం, జోహర్, హరిక్రిష్ణ, డీలర్లురామసుబ్బారెడ్డి, లక్ష్మి, గౌస మోహిద్దీన్, అజారుద్దీన్‌లు పాల్గొన్నారు.



కానుకలను పంపిణీ చేస్తున్న అన్సర్‌బాషా

చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తానన్న హామీ ఏమైంది..?

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తానంటూ దీబగుంట్ల సభలో సిఎం ఇచ్చిన హామీ ఏమైందని సిపిఎం జిల్లా నాయకులు మస్తాన్‌వలి శనివారం ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. టిడిపి ప్రభుత్వంలోనే చక్కెర ఫ్యాక్టరీ ప్రైవేట్ పరమైందన్నారు. ఫ్యాక్టరీ మూతపడి కార్మికులు కడుపులు కాల్చుకుంటూ రోడ్డున పడి అరిచిన పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల ఆకలి కేకలు చెవిటి వాని ముందు శంఖం ఊదినట్లు అయిందని పేర్కొన్నారు. ఫ్యాక్టరీ యజమాని మధుసూదన్ గుప్త యంత్రాలను అమ్మేసి, ఫ్యాక్టరీ స్థలాలను ప్లాట్లు అమ్ముకుంటున్నారని, అనేక సార్లు ఆందోళనలు, దీక్షలు రాజకీయాలకు అతీతంగా చేస్తే అధికారులు యాజమాన్యానికి వత్తాసు పలికారే తప్ప కార్మికులకు న్యాయం జరగలేదన్నారు. నంద్యాల పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొస్తే దీబగుంట్ల జన్మభూమి సభలో షుగర్ ఫ్యాక్టరీ అమ్మకుండా ఇండస్ట్రియల్ ఎస్టేట్ చేస్తామని, నిరుద్యోగులకు, కార్మికులకు ఉపాధి చూపిస్తామని హామీ ఇచ్చి నేటికి అమలు చేయలేదన్నారు.

ఆనందలహరి పాఠశాలలు ప్రారంభం

ప్రజాశక్తి - రుద్రవరం

నర్సాపురం, కొండమాయిపల్లె గ్రామాల్లో ఆనంద లహరి పాఠశాలలు ఏర్పాటు చేసినట్లు ఎంఇఒ సాహెబ్ హుసేన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ నర్సాపురం స్పెషల్ పాఠశాలలో ఆనంద లహరి పాఠశాలను నోడల్ అధికారి సోమశివారెడ్డి, తహసీల్దార్ శివరాముడు ప్రారంభించామన్నారు. పాఠశాలల్లో బహుళస్థాయి బహు తరగతి పద్ధతులకు అనుగుణంగా పాఠాలకు బదులుగా మైలురాళ్లు ఏర్పాటు చేసి పిల్లలకు అభ్యసన చేయడం జరుగుతుందన్నారు. 4గ్రూపులు ఏర్పాటు చేసి విద్యార్థులకు బోధన చేయడం జరుగుతుందన్నారు. సర్పంచి ప్రసాదరెడ్డి, పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నంద్యాల క్రైం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌డిఒ రామసుందర్‌రెడ్డి

పట్టణంలోని స్థానిక బొమ్మలసత్రం వద్ద ఉన్న ఆర్‌డిఒ కార్యాలయంలో రెడ్‌క్రాస్ డివిజన్ ఛైర్మన్ దస్తగిరి పర్ల ఆధ్వర్యంలో శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ క్యాలెండర్ ఆర్‌డిఒ రామసుందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రక్తదానంపై ప్రజల్లో విస్తృతంగా అవహన కల్పించి రక్తదానాన్ని ప్రోత్సహించాలని కోరారు. ఎ. శివరామిరెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటి రాష్ట్ర కమిటీ సభ్యుడు తెలకపలి రాధాకృష్ణయ్య, డివిజన్ సెక్రటరీ ఉస్మాన్‌బాష, కోశాధికారి నాగేశ్వరరావు, నంద్యాల మండల ఛైర్మన్ నాగేశ్వరరెడ్డి, బేతంచర్ల మండల ఛైర్మన్ సురేంద్ర, సభ్యులు రమేష్, యాకూబ్, నాగరాజు, ఉబేదుల్లా, శ్రీనివాస్, వరప్రసాద్ పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ సంక్షేమ ఫలాలు



సభలో మాట్లాడుతున్న భూమా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల : పట్టణ పరిధిలోని 23నుంచి 26వ వార్డుల్లో జన్మభూమి సభలు నిర్వహించారు. 24 నుంచి 26వ వార్డుల్లో జరిగిన జన్మభూమి సభల్లో ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా వార్డుల్లోని కౌన్సిలర్లు, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు. 23వ వార్డులో జరిగిన జన్మభూమి సభకు శాసనమండలి ఛైర్మన్ ఎన్ఎండి ఫరూక్ హాజరై మాట్లాడారు. డిఎఫ్‌ఐడి పథకం కింద సిసి రోడ్లను వివి కాలనీ, దేవనగర్, సాయిబాబా నగర్‌లో వేయించి అభివృద్ధికి బాటలు వేసింది టిడిపి ప్రభుత్వమేనన్నారు. పట్టణ పేదలను దృష్టిలో పెట్టుకొని గృహ సౌకర్యం కల్పించేందుకు నేడు ప్రత్యేక పథకాన్ని రూపొందించడం జరిగిందని, ఇళ్లులేని పేదలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒక్క నంద్యాలలోనే 13వేల గృహలను నిర్మించి ఇస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్సీ కెఇ.ప్రభాకర్ మాట్లాడుతూ వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రజా ప్రతినిధులు, అధికారులు మీ దగ్గరకు వస్తున్నారని అన్నారు. అనంతరం గర్భిణులకు శ్రీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన, చంద్రన్న బీమా పాలసీలను పంపిణీ చేశారు. కెడిసిసి బ్యాంకు ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ మోదకొండ, సిడిపిఒ ఏగ్నెస్ ఏంజల్, మాజీ కౌన్సిలర్ జయచంద్రారెడ్డి, మిద్దె హుసేని, వార్డు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

రైతుల గోడు ప్రభుత్వానికి పట్టదా

దొర్నిపాడు : రైతుల గోడు ప్రభుత్వానికి పట్టదా అని అర్జునపురం గ్రామ రైతులు అధికారులను నిలదీశారు. శనివారం అర్జునపురం గ్రామంలో జరిగిన జన్మభూమి – మా ఊరు కార్యక్రమంలో రైతులు మాట్లాడారు. గ్రామంలో వర్షాలు పడక మినుము పంట ఎండిపోయిందని, అతి వర్షాలతో జొన్న పంట ఎండిపోయిందని, మరల వరినాటితే ఉల్లిపోటు తెగులుతో పంట కనీస స్థాయి దిగుబడి వచ్చిందన్నారు. వ్యవసాయాధి కారిని పంటల బీమా వరికి ఉండదా అని ప్రశ్నించగా, సరాసరి సగటు ఎకరాకు 37బస్తాలు వస్తున్నాయని పేర్కొన్నారు. దీనిమూలంగా బీమా ఇవ్వడం కుదరదన్నారు. రైతులు ఆగ్రహంతో వెయ్యి మందిలో ఒకరికి దిగుబడి వస్తే, ఆ గణాంకాలను మీరు చూసుకుంటారా అని ప్రశ్నించారు. వరి పంట దిగుబడిని ఏ ప్రతిపాదికన నిర్ధారిస్తారని నిలదీశారు. గ్రామంలో అతివృష్టి, అనావృష్టితో పంటల దిగుబడి తగ్గితే, దిగుబడి సరాసగులు ఎక్కువ చూపడం ఏమేరకు సమంజసమన్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన వరిపంట రైతులకు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నోడల్ ఆఫీసర్ వర ప్రసాద్, సర్పంచి బుర్రెడ్డి, ఎంపిడిఒ సుజాతమ్మ, తహశీల్దార్ తిరుపతిసాయి, అధికారులు పాల్గొన్నారు.



దొర్నిపాడులో అధికారులను నిలదీస్తున్న రైతులు

రుద్రవరం : మండలంలోని ముత్తలూరు, నర్సాపురం గ్రామాల్లో శనివారం జన్మభూమి కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. నోడల్ అధికారి సోమశివారెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ శివరాముడు, ఎంపిడిఒ నీరజ రెండు బృందాలుగా ఏర్పడి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఉపకార వేతనాలు, గ్రామస్తులకు చంద్రన్న ఉచిత కానుకలు అందజేశారు. సర్పంచి ప్రసాదరెడ్డి, రంగమ్మ, ఎంఇఒ సాహెబ్ హుసేన్, వ్యవసాయా ధికారి ప్రసాద్‌రావు, డాక్టర్ మనోరంజన్ ప్రతాప్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామకృష్ణ నాయక్, ఎంఐ ఎఇ చంద్రశేఖర్, వెలుగు ఎపిఎం నాగమ్మ, ఉపాధి ఎపిఒ వెంకటేష్, పిఆర్ ఎఇ మదన్‌మోహన్, హౌసింగ్ ఎఇ రాజా రఘువర్మ, ఐఎపిఆర్‌డి రామకృష్ణ వేణి పాల్గొన్నారు.

గోస్పాడు : ప్రజల సమస్యలు పరిష్కరించడానికి జన్మభూమి ఉపయోగపడు తుందని ఎంపిడిఒ సుగుణ శ్రీ పేర్కొన్నారు. జూలేపల్లె, కానాలపల్లె గ్రామాల్లోఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ సుధాకర్ బాబు, నోడల్ అధికారి నాగరాజు, జూలేపల్లె సర్పంచి పార్థసారథిరెడ్డి, ఎపిఒ రామేశ్వరమ్మ, ఉప తహసీల్దార్ రామనాథరెడ్డి, పాల్గొన్నారు.

చాగలమర్రి : అర్హులైన నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలను అందించి వారికి అండగా టిడిపి ప్రభుత్వం నిలుస్తుందని ఎంపిపి ఏ భాగ్యలక్ష్మి తెలిపారు. శనివారం మల్లేవేముల, గోట్లూరు గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు దామోదరమ్మ, లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన 5వ విడత జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిశీలకులు శివప్రసాద్, టిడిపి పరిశీలకులు గోవర్ధన్‌రెడ్డి ఎంపిపి ఏ భాగ్యలక్ష్మీ హాజరై పరిశీలించారు. ఈ కార్యక్రమాన్ని మండలనోడల్ అదికారి సంజీవరాజు పర్యవేక్షించారు. మల్లేవేముల గ్రామంలో సర్పంచి దామోదరమ్మ, ఎంపీపీ ఏభాగ్యలక్ష్మి రైతులకు ట్రాక్టర్లను పలు సంక్షేమ పథకాలను పంపిణీ చేశారు. నాయకులు స్వామిరెడ్డి, భాస్కరరెడ్డి ఎంపీడీఓ రాణెమ్మ , తహశీల్దార్ మాలకొండయ్య, ఎంఇఒఅనురాధ, పాల్గొన్నారు.



మంత్రి సమక్షంలో గ్రామస్తులు టిడిపిలోకి చేరిక

ఎల్లావత్తుల గ్రామస్తులు టిడిపిలోకి..

ఆళ్లగడ్డ : రుద్రవరం మండలం ఎల్లావత్తుల గ్రామానికి చెందిన మురళి,హరి,శంకర్ తదితర కుటుంబాలు రాష్ట్రపర్యాటక శాఖామంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో శనివారం టిడిపిలో చేరారు. టిడిపిలో చేరిన వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బివిరామిరెడ్డి ఉన్నారు.

కోర్టు ఏర్పాట్లను జిల్లా జడ్జి పరిశీలన

ఆళ్లగడ్డ : పట్టణంలోని కోర్టు ఆవరణంలో నూతనంగా ఏర్పాటు కాబోయే జిల్లా కోర్టు ఏర్పాటుకు అవసరమైన వసతులను జిల్లా జడ్జి అనుపమ చక్రవర్తి శనివారం పరిశీలించారు. ప్రస్తుతం నంద్యాలలో ఉన్న ఐదవ అదనపు జిల్లా కోర్టును ఆళ్లగడ్డ ఏర్పాటు కానుంది. ఆమె కోర్టు ఏర్పాటుకు కావాల్సిన వసతులపై సీనియర్ న్యాయమూర్తి నరేష్, జూనియర్ న్యాయమూర్తి దివాకర్, న్యాయవాదులతో చర్చించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూర్యనారాయ ణరెడ్డి, మాజీ అధ్యక్షులు రమణయ్య, న్యాయవాదులు నీలకం ఠేశ్వరం, షఫ్రక్ రామిరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

వ్యకాస క్యాలెండర్ విడుదల

నంద్యాల : వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ రామసుందర్‌రెడ్డి విడుదల చేశారు. ఆర్‌డిఒ రామసుందర్‌రెడ్డి మాట్లాడుతూ నిత్యం వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పని చేసే వ్యవసాయ కార్మిక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ విడుదల చేయడం శుభపరిణామమన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మికులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యకాస డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బంగారయ్య, సద్దాం హుసేన్, బండి రత్నమయ్య, కరీముల్లా, కెవిపిఎస్ నాయకులు ఆల్ఫోన్స్ పాల్గొన్నారు.

ఘనంగా ఆహార భద్రత దినోత్సవం

శిరువెళ్ల : శిరువెళ్ల మండలం గుంప్రమాదిన్నె, వణికెం దిన్నె గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి అబ్దుల్‌హాక్ ఆధ్వర్యంలో జాతీయ భద్రత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి ఆహార ధాన్యాలను అందించే అన్నదాతలతో పాటు రెక్కల కష్టంమీద పూటగడిచేందుకు కృషి చేసే శ్రమజీవులు ఆహార భద్రత, సలహాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. మండల విస్తరణాధికారులు హేమవతి, రాజు, ఎంపిఇఒ పాల్గొన్నారు.

సిపిఎం 21వ జిల్లా మహాసభల పోస్టర్ విడుదల

గోస్పాడు : మండలంలోని విద్యుత్ ఆఫీసులో మండల కన్వీనర్ నరసింహ సిపిఎం 21వ జిల్లా మహాసభ పోస్టర్‌ను విడుదల చేశారు. పుల్లా నరసింహ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిజాయితీగా నిరంతరం పోరాటం చేస్తున్నది ఒక్క సిపిఎం అన్నారు. ఈ మహాసభలు ఆల్లూరులో జరుగుతాయి, ఈ సభకు ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. మండల కార్యదర్శి చెన్నయ్య, మండల నాయకులు సురేష్, మార్క్, కరీముల్లా, సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధన

ఆళ్లగడ్డ రూరల్ : పట్టణంలోని బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం త్యాగరాజస్వామి ఆరాధనా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం త్యాగరాజస్వామికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం నాలుగురోడ్ల కూడలి నుంచి త్యాగరాజస్వామి చిత్రపటాన్ని బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఊరేగింపుగా గాయత్రీ అమ్మవారి ఆలయం వద్దకు తీసుకెళ్లారు. బ్రాహ్మణ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు ఆలూరు రామశాస్త్రి, నాయకులు దక్షిణామూర్తి, నాగమోహన్‌రావు, కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, రామారావు, జగన్‌మోహన్ శర్మ, వెంకోబ,కిషోర్, రామకృష్ణ, సుబ్బారావు, సత్యదేవ్‌శర్మ, ఆ సంఘం నాయకులు పెద్దబోదనం రమణయ్య, సంజీవరాయుడు, నరసింహుడు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
కర్నూలు
ఆదివారం 07
జనవరి 2018

ఫోకస్

వట్టిపోతున్న పాడి

ముమ్ముందు తీవ్రం కానున్న గ్రాసం కొరత
పెరుగుతున్న దాణా ధరలు
తరిగిపోతున్న పశుసంపద

ఆవులు, ఎద్దులు : 4,09,575
గేదెలు, దున్నపోతులు : 4,10,783
గొర్రెలు, పొట్టేళ్లు : 15,04,038
మేకలు, మేకపోతులు : 5,05,112



ప్రభుత్వ ఉదాసీనత, పెరుగుతున్న దాణా ఖర్చులు.. ఏటా తీవ్రమౌతున్న పశుగ్రాసం కొరత వల్ల నానాటికీ పాడి పరిశ్రమ అంతరించిపోతోంది. పశువుల ధరలు కూడా ఏడాదికేడాది పెరిగిపోతున్నాయి. పాలకు గిట్టుబాటు ధర లభించడం లేదు. మరోవైపు పశుగ్రాసం పథకాల్లో సకాలంలో రాయితీలు, చెల్లింపులు సక్రమంగా అందడం లేదు. దీంతో పాడి పశుపోషణపై రైతులు అనాశక్తి చూపుతున్నారు. అందువల్ల పాల ఉత్పత్తి ఏటా పడిపోతోంది.. పాడి వట్టిపోతోంది..

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

జిల్లాలో నెలకు 60 వేల మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తి జరుగుతోంది. ప్రతి మూడు నెలలకు 2.5 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని పశుసంవర్ధక శాఖ అధికారుల అంచనా. వాస్తవానికి రోజుకు పాల దిగుబడి 7.20 లక్షల లీటర్లు మాత్రమే ఉంది. పాల వినియోగం దాదాపు 13 లక్షల లీటర్లు అవసరం ఉంది. జిల్లాలో 40 లక్షల జనాభా ఉండగా చిన్న పెద్ద కలిసి సరాసరి ఒకొక్కరు పావు లీటరు పాలు వినియోగిస్తారని అంచనా. జిల్లాలో ఏటా కరువు ఛాయలు కమ్ముకోవడం వల్ల పశుగ్రాసం కొరత ఏర్పడి పాల దిగుబడి తగ్గుతోంది. దాణా ధరలు కూడా అందుబాటులో లేవు. దీంతో పశుపోషణ భారమై పశువులను కబేళాలకు తరలించి అమ్ముకుంటున్నారు. ఈ కారణాల వల్ల ఏటా జిల్లాలో పశుసంపద తగ్గుతోంది.

పశుగ్రాసం పెంపకందారులకు అందని ప్రభుత్వ సాయం

జిల్లాలోని రైతులకు వానలు లేని కాలంలో బోర్ల కింద, బావుల కింద గడ్డి పెంచుకోవడానికి మహాత్మగాంధీ జాతీయ ఉపాధి పథకం ద్వారా కొన్ని రాయితీలను ప్రభుత్వం ఇచ్చింది. ఊరూరా పశుగ్రాస క్షేత్రాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో 3160 ఎకరాల్లో పశు గ్రాసం పెంచేలా 292 మంది రైతులకు అనుమతి ఇచ్చారు. 2 సంవత్సరాలకు పశుగ్రాసం పెంచేందుకు ప్రభుత్వం రూ.77 వేలు ఇస్తుంది. అదే కౌలు రైతు గ్రాసం పెంచితే ప్రభుత్వమే కౌలు కూడా ఇస్తుంది. అలా ఇప్పటి వరకు రూ.95 లక్షలు ప్రభుత్వం ఇచ్చింది. ఇంకా రూ.40 లక్షలు ఇవ్వాల్సి ఉంది. పెంచిన గ్రాసాన్ని ఇతర రైతులకు కిలో ఒక్క రూపాయికే అమ్మాలని నిర్ణయించారు. అయితే ఇక్కడ అధికారులు చెప్పిన దానికి భిన్నంగా రైతులు పేర్కొంటున్నారు. మాకు ఇంత వరకు ఎలాంటి ధనసాయం చేయలేదని, మా తిప్పలు మేమే పడుతున్నామని చెబుతున్నారు. పశుగ్రాసం పెంచడం వల్ల నష్టం వచ్చిందే గాని లాభాలు రాలేదని వాపోతున్నారు. దీంతో గ్రామాల్లోని పాడి పశువులను సంతలకు తరలించి వచ్చిన కాడికి అమ్మేస్తున్నారు.

భారంగా మారిన పశుగ్రాసం : రైతులకు గత కొన్ని సంవత్సరాలుగా పశువుల పోషణ భారంగా మారింది. ఒక్క ట్రాక్టర్ గడ్డి రూ.6 వేల నుంచి రూ.9 వేలు ఉంటుంది. అంత పెట్టి గడ్డి కొనడం రైతులకు భారం కావడంతో ఆర్థికంగా చితికిపోతున్నారు. పచ్చిగడ్డి లేక పశువులు బక్కచిక్కిపోతున్నాయి. గ్రామాల్లో పచ్చిగడ్డిని పెంచి ప్రభుత్వమే రైతులకు ఉచితంగా అందజేయాల్సిన అవసరం ఉంది. నీరు, గడ్డి కొరత కారణంగా పశువులను పోషించుకోలేక కొందరు కబేళాలకు తరలిస్తున్నారు. ప్రస్తుతం గ్రాసం కొరత పడమర ప్రాంతాల్లో ఉందని, వచ్చే నెలల్లో ఎండలు ముదిరితే జిల్లా అంతటా గ్రాసం కొరత ఏర్పడుతుందని రైతులు పేర్కొంటున్నారు.

దడ పుట్టిస్తున్న దాణా ఖర్చులు : పాడి రైతులకు దాణా ధరలు దడ పుట్టిస్తున్నాయి. పాడి పశువుల పెంపకంలో 60 శాతం నుంచి 70 శాతం వరకు మేత కోసం ఖర్చు చేయాల్సి వస్తోంది. పెరుగుతున్న దాణా ధరలకు అనుగుణంగా పాల ధరలు పెంచకపోవడంతో పాడి రైతులు నష్టాల భారిన పడుతున్నారు. గతంలో తవుడు క్వింటా బస్తా రూ.1600 ఉండగా ప్రస్తుతం రూ.2100కు చేరింది. పచ్చగడ్డి ఎకరా రూ.34 వేలు పలుకుతుంది. గతంలో పశువుల మందులను 50 శాతం రాయితీపై అందించేవారు. ఇప్పుడు రాయితీని 30 శాతానికి తగ్గించారు.

అక్కరకు రాని పథకాలు : ప్రభుత్వ పథకాలు పాడి రైతులకు చేరువ కాకపోవడంతో ఆర్థిక ప్రోత్సాహం కరువైంది. పశువైద్య కేంద్రాలు, మార్కెట్ కమిటీలు, సహకార సంఘాల ద్వారా పశుగ్రాస విత్తనాలు, దాణాను ప్రభుత్వం రాయితీపై ఇస్తున్నా అవి పాడి రైతులకు చేరడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న పశుక్రాంతి పథకం రైతులకు అక్కరకు రావడం లేదు. నిబంధనలు సైతం కఠినంగా ఉండడంతో రైతులు ఆసక్తి చూపడం లేదు. సహకార రుణాలు పక్కదోవ పడుతున్నాయనే ఆరోపణలూ ఉన్నాయి.

గ్రాసం అమ్మకంలో నష్టం వచ్చింది
రైతు పి.నరేష్, చాగలమర్రి

నాకున్న 5 ఎకరాల్లో పశుగ్రాసం పెంచాను. ఎకరాకు రూ.20,000 చొప్పున రూ.లక్ష ఖర్చు వచ్చింది. ప్రభుత్వం ఇస్తామన్న నగదు ఏమీ ఇవ్వలేదు. పైగా కిలో గ్రాసం రూపాయికే అమ్మాలని షరతు పెట్టింది. అదే ధరకు అమ్మితే దానికే సరిపోయింది. 2 సంవత్సరాలకు కలిపి ప్రభుత్వం ఇస్తామన్న ఎకరాకు రూ.77 వేలు ఇస్తే చాలా మేలు చేసినట్లే. దాణా ధరలు కూడా తగ్గిస్తే పాడి బాగుడుతుంది.

శ్రమ చేసినా ఫలితం ఉండడం లేదు
రైతు రాముడు, చాగలమర్రి

ఆరుగాలం కుటుంబమంతా కలిసి శ్రమించినా ఫలితం ఉండడం లేదు. పాల ధరలు గిట్టుబాటు కాక ఇబ్బంది పడుతున్నాం. నాకున్న 2 ఎకరాల్లో కేజీ రూ.400లతో విత్తనాలు కొని గ్రాసం వేశాను. ప్రభుత్వం నుంచి ఇంత వరకు ఎలాంటి సాయం అందలేదు. నా పశువులకు కావాల్సినంత తీసుకుని మిగిలిన గ్రాసం అమ్ముతున్నాను. ఇటు పాలల్లోనూ, అటు గ్రాసం అమ్మకంలోనూ లాభం ఏమీ మిగలడం లేదు.

పట్నం బాటన పల్లె

ఆదుకోని ఉపాధి హామీ పథకం
శనివారం ఒక్కరోజే 5 వేల మంది వలస

ప్రజాశక్తి - ఆదోని

జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో పల్లెలు ఖాళీ అవుతున్నాయి. పల్లె వాసులు పొట్టకూటి కోసం పట్నం వైపు పరుగులు తీస్తున్నారు. ఖాళీ చేతులతో, కాలే కడుపులతో పొట్టచేతబట్టుకొని వలసబాట పడుతున్నారు. నేల తల్లిని నమ్ముకున్న అన్నదాతకు పిడికెడు మెతుకులు కరువయ్యాయి. పశ్చిమ ప్రాంతంలో ఉపాధి లేక బతుకుతెరువు కోసం పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లడంతో గ్రామాలు ఖాళీ అవుతున్నాయి. వలసలు నివారించి ఉపాధి హామీ పనులు చేపట్టాలని ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సక్రమంగా అమలుకు నోచుకోవడం లేదు. అధికారులు అవినీతికి పాల్పడుతూ చేసిన పనులకు కూలిలు ఇవ్వకుండా వేధించడం, పనులు చూపించకపోవడంతో బతుకుదెరువు కోసం పిల్లాపాపతో తరలిపోతున్నారు.

ఆదోని డివిజన్‌లోని పలు గ్రామాలకు చెందిన వ్యవసాయ కూలీలు పొలాలో పనులు లేకపోవడంతో బెంగుళూరు, కడప, బళ్లారి, గుల్బర్గా ప్రాంతాలకు బస్సు, రైళ్లలో శనివారం ఒక్క రోజే ఐదు వేల మందికి పైగా బయలుదేరి వెళ్లారు. అన్నదాతలను నమ్ముకొని జీవనం సాగించే కూలీల పరిస్థితి దారుణంగా మారింది. ఒకప్పుడు పచ్చని అందాలు, పంట పొలాలు, సమైక్య జీవన సౌందర్యంతో కళకళలాడిన పల్లెటూళ్లు నేడు శ్మశాన వైరాగ్యంతో వెలవెలబోతున్నాయి. వ్యవసాయ దెబ్బతిని, చేతివృత్తులు పడిపోవడంతో బతుకుతెరువు కోసం పల్లెజనం వలస పక్షులై ఎగిరిపోతున్నారు. కుక్కిన నులక మంచాల్లో ముడుచుకున్న ముసలోళ్ల దీనపు చూపులే గ్రామాల్లో కనిపిస్తున్నాయి. పని కోసం తల్లిదండ్రులు పట్టణాలకు వలస వెళ్లడంతో ఆవులేని దూడల్లా పసిపిల్లలు బిక్కుముఖం వేసుకొని అమాయకంగా దిక్కులు చూసే దృశ్యాలు మనస్సును కలచివేస్తున్నాయి. కన్నబిడ్డల కన్నా ప్రేమగా చూసుకొనే పశువులకు మేత కరువై ఎముకల గూడుల్లా మారడంతో కసాయి కత్తులకు అమ్ముకునే దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఇన్నాళ్లు పల్లెల్లో ఎంతో కొంత ఊరట నిచ్చిన ఉపాధి పథకంపై అటు కేంద్ర ప్రభుత్వం సీత కన్ను వేసింది. నిధులు విడుదల చేయడంలో నత్తతో పోటీ పడింది. ప్రజాప్రతినిధులు నోరు విప్పలేకపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ ఏమాత్రం కనిపించడం లేదు. వీడియో కాన్ఫరెన్సులు, టెలీకాన్ఫరెన్సులతో నిత్యం ఉపాధిపై సమీక్షలపై హడావుడి చేసే అధికార యంత్రాంగం కూలీలకు బిల్లులు అందాయా లేదా అని ఎన్నడూ చూసింది లేదు. దీంతో ఉపాధి కూలీల సంఖ్య పడిపోయి ఉపాధి హామీని హడలిస్తోంది. ఏడాదికేడాది కూలీల సంఖ్య క్షీణించి, తిండి కోసం వందల కిలోమీటర్లు పొట్ట చేతబట్టి తరలిపోతున్నారు. పని అడగండి చూపిస్తామంటూ అధికారులు గొప్పలు చెబుతున్నారు. వారి మాటలు విని వలసలు వెళ్లకుండా సొంత గ్రామాల్లో ఉంటూ ఉపాధి పనులకు వెళుతున్నారు. పనికి వెళ్లినా కూలి సొమ్ము మాత్రం నెలలు తరబడి ఇవ్వడం లేదు. దీంతో కూలీలు కుటంబాలు గడవడం కోసం అష్టకష్టాలు పడుతున్నారు. ఈ ఉపాధి మాకొద్దంటు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముసలీముతక, చంటి పిల్లలను ఇంటి పట్టున వదలి బతుకుతెరువు కోసం గుంటూరు, బెంగుళూరుకు వలసబాట పడుతున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాలు ఖాళీ అయ్యాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే మరిన్ని గ్రామాలు వలస బాటపట్టే అవకాశముంది. ఇప్పటికైనా ఉపాధి హామీ ఉన్నతాధికారులు మండలంలో పెండింగులో ఉన్న కూలీల వేతనాలను చెల్లించి, ఉపాధి పనులు కల్పించి వలసలు అరికట్టాలని పలువురు కోరుతున్నారు.


పిల్లాపాపలతో వలస వెళుతున్న వ్యవసాయ కూలీలు

ప్రత్యామ్నాయం చూపకపోవడం దారుణం
వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి రామాంజినేయులు

కరువు మండలాలను దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపకపోవడం మరింత దారుణం. కూలీలకు సక్రమంగా బిల్లులు చెల్లిస్తే పనికి రావడానికి ఆసక్తి కనబరుస్తారు. నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడం, ప్రత్యామ్నాయం చూపకపోవడంతో కూలీలు అసక్తి చూపడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపన, ఇతరత్రా ఉపాధి అంశాలపై దృష్టి సారించాలి.

రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల దృశ్యాలు


మాంటిస్సోరి స్కూల్‌లో స్వాగతం పలుకుతున్న సైన్స్ ఎగ్జిబిషన్


రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు, అతిథులతో ముఖాముఖి మాట్లాడుతున్న సిసిఎంబి మాజీ సంచాలకులు మోహన్‌రావు


పాటలు పాడుతున్న ప్రజానాట్యమండలి కళాకారులు బసవరాజు, సుజాత, లోకేష్


కళ్యాణమ్మ విగ్రహానికి పూలమాల వేసి జోహార్లు అర్పిస్తున్న జెవివి రాష్ట్ర నాయకులు, సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శౌరీలు రెడ్డి తదితరులు


గేయానంద్‌కు పూలబొకే అందజేస్తున్న విద్యార్థిని


మోహన్ రావుకు పూలబొకే అందజేస్తున్న విద్యార్థిని


డా.శంకర్‌శర్మకు పూలబొకే అందజేస్తున్న విద్యార్థిని


మాట్లాడుతున్న బడేసాబ్


ఇంద్రజాల ప్రదర్శనలో చేతిపై వస్తున్న మంటలు


ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సిపిఎం నాయకులు గౌస్‌దేశాయ్


ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విద్యార్థులు


అతిథులకు వివరిస్తున్న పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు


భూకంపాలను తట్టుకునే ఇళ్ల గురించి వివరిస్తున్న పుల్లయ్య విద్యార్థులు


ప్రజాశక్తి బుక్‌హౌస్ పుస్తక ప్రదర్శన


గుండె చప్పుడు విధానంపై వివరిస్తున్న సెయింట్ జోసెఫ్ విద్యార్థినులు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ తిరుపాలు, నాయకులు

వ్యకాస క్యాలెండర్ ఆవిష్కరణ

బేతంచర్ల : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 2018 క్యాలెండర్‌ను ఆ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆర్ ఈశ్వరయ్య, బేతంచర్ల ఎస్ఐ తిరుపాలు శనివారం విడుదల చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ వ్యకాస వ్యవసాయ కూలీల కోసం వారి న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఎన్నో ఉద్యమాలు చేస్తుందని తెలిపారు. సీనియర్ నాయకులు ఎల్లయ్య, మండల అధ్యక్ష కార్యదర్శులు అంజలి, నీలకంఠం, లక్ష్మీదేవి, మహాలక్ష్మీ, దేవమ్మ, మధుశేఖర్, పి.వెంకటరమణ పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దయ్యే వరకు పోరాటం

కోవెలకుంట్ల : సిపిఎస్ విధానాన్ని రద్దు చేసే వరకు పోరాటం ఆగదని ఎపిఎన్‌జిఒ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉలవల రామక్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎపిఎన్‌జిఒ సంఘం నాయకులు బషీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిరసన, ధర్నా కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. నాయకులు మునిస్వామి, సుధాకర్‌రెడ్డి, నారాయణ, భాస్కర్, రవికాంత్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రమణ, ఉపాధ్యాయ సంఘం నాయకులు సుబ్బారెడ్డి, వెంకటరామిరెడ్డి, రవి, ప్రసాద్‌రెడ్డి, ఖాజాహుస్సేన్, షరీఫ్, పక్రుద్దీన్, మునిరాజు, మద్దిలేటి, ప్రసాద్, ఫరూక్, వాసుదేవకుమార్, శేఖరుడు, సత్యనారాయణ, భాష, మాలిక్‌బాష, తులసి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె అర్బన్: సిపిఎస్ విధానం రద్దయ్యే వరకు పోరాటం ఆగదని ఎపిటిఎఫ్ జిల్లా అదనపు కార్యదర్శి మాధవస్వామి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎపిటిఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షులుగా సుబ్బరాయుడు, అధ్యక్షులుగా లింగమయ్య, సహ అధ్యక్షులుగా రామమూర్తి, ప్రధాన కార్యదర్శిగా రామక్రిష్ణ, అదనపు కార్యదర్శిగా శ్రీనివాసనాయక్, ఉపాధ్యక్షులుగా మనోహర్, కార్యదర్శులుగా దస్తగిరి, విజయ, రమేష్‌ను ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిలర్లుగా మాధవస్వామి, యం మధుసూధన్‌రావు, డి నాగరాజు, పి గోపాల్‌రావు, ఎన్‌సి మద్దిలేటి, రాజునాయక్‌ను ఎన్నుకున్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

బేతంచర్ల : బేతంచర్ల మండలం బుగ్గాన్‌పల్లె గ్రామంలో టిడిపి మండలాధ్యక్షులు బుగ్గన సంజీవరెడ్డి తమ తండ్రి జ్ఞాపకార్థం సొంత ఖర్చులతో రూ.5 లక్షలతో ఉచిత మినరల్ వాటర్ ప్లాంటును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేతంచర్ల పెద్దాయనగా పిలువబడే మాజీ బుగ్గన మురళీధర్‌రెడ్డి నేడు ప్రథమ వర్ధంతి సందర్భంగా బుగ్గాన్‌పల్లె గ్రామంలో పేద ప్రజలకు ఉచిత మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేశామన్నారు. వాటర్ ప్లాంట్‌ను బుగ్గన సంజీవరెడ్డి తల్లి బుగ్గన రాధమ్మ ప్లాంటును ప్రారంభించారు. కుటుంబ సభ్యులు, మండల కన్వీనర్ అశోక్‌కుమార్, గౌరి రామిరెడ్డి, పోలూరు భాస్కర్‌రెడ్డి, అనంతరమణ, బుగ్గన ప్రసన్నలక్ష్మి, ఎల్లారెడ్డి, యోగేంద్రబాబు, పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ

కొలిమిగుండ్ల : గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడమే కోసమే క్రీడా దుస్తులను పంపిణీ చేస్తున్నట్లు టిడిపి జిల్లా కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి, టిడిపి నాయకులు వి రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అంకిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి టిడిపి జిల్లా కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి, టిడిపి నాయకులు వెన్నపూస రామచంద్రారెడ్డి, బందార్లపల్లె కళ్యాణ్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వెన్నపూస రామచంద్రారెడ్డి 30 మంది క్రీడాకారులకు రూ.15 వేలు విలువ చేసే క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. రవి ప్రకాష్‌రెడ్డి, వి రామ్మోహన్‌రెడ్డి, పల్లె వెంకటేశ్వర రెడ్డి, బాలరంగయ్య, విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవితాలను నాశనం చేసుకోవద్దు : ఎమ్మెల్యే బిసి

ప్రజాశక్తి బనగానపల్లె అర్బన్

విద్యార్థులు చదువుకునే వయస్సులో రాజకీయాలవైపు వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎమ్మెల్యే బిసి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవం జరిగింది. ప్రిన్సిపల్ శంకర్‌నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే బిసి మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివితే ర్యాంకులు రావని అపోహ తల్లిదండ్రుల్లో ఉందన్నారు. గతేడాది ఇంటర్ ఫలితాల్లో బనగానపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని రేవతి రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంకు సాధించిందన్నారు. ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలల కంటే ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. తాము పడ్డ కష్టం తమ పిల్లలు పడ కూడదని తల్లిదండ్రులు కష్టపడి మిమ్మల్ని చదివిస్తున్నారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నత చదువులు చదివి మంచి ర్యాంకులు సాధించాలన్నారు. కొందరూ రాజకీయ నాయకులు, అనుచరులు తమ పబ్బం గడుపుకునేందుకు ఇంటర్ విద్యార్థులను రాజకీయ సమావేశాలకు తీసుకెళ్లి విద్యార్థుల జీవితాలను నాశనం చేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. ఇంటర్ విద్యార్థి జీవితానికి మలుపు లాంటిదన్నారు.ఇక్కడ కష్టపడి చదివితే భవిష్యత్తు బంగారు బాటగా ఉంటుందన్నారు. విద్యార్థులను తప్పుడు మార్గంలోనికి తీసుకుపోవడం మంచిది కాదని, తమ స్వార్థ రాజకీయాల కోసం విద్యార్థుల జీవితాలను బలి చేయవద్దన్నారు. కళాశాలలో తాగునీటి సమస్య ఉందని. మిని వాటర్ ట్యాంకును నిర్మించాలని కళాశాల ప్రిన్సిపల్ కోరారు. విద్యార్థుల కోసం మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టంగుటూరి శీనయ్య, నందవరం సహకార సంఘం మాజీ అధ్యక్షులు మీరాపురం బాలిరెడ్డి, కళాశాల అధ్యాపకులు మద్దిలేటిస్వామి, వెంకటప్రసాద్, వెంకటేశ్వర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిసి జనార్దన్‌రెడ్డి

నాసిరకం కానుకలిచ్చి రోగులుగా చేయొద్దు

- మాజీ ఎమ్మెల్యే కాటసాని



బూజుపట్టిన సంక్రాంతి కానుకలను చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రజాశక్తి బనగానపల్లె

ప్రభుత్వం నాసిరకం సంక్రాంతి కానుకలిచ్చి ప్రజలను రోగాల బారిన పడేస్తుందని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విమర్శించారు. శనివారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కాటసాని నివాసంలో బూజుపట్టిన బెల్లం, ముగ్గిపోయిన కందిబ్యాళ్ల నాసిరకం సంక్రాంతి కానుకలను విలేకర్లకు చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులకు సంక్రాంతి, క్రిష్టియన్‌లకు క్రిస్మస్, ముస్లిములకు రంజాన్ కానుకలను ఇస్తున్నామని ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకుంటూ ప్రజలకు నాసిరకం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని టిడిపి ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందన్నారు. సంవత్సరానికి రూ.350 కోట్లు ఖర్చు పెట్టి కానుకలు ఇస్తున్నట్లు ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని పేర్కొన్నారు. టిడిపి నాయకులకు సంక్రాంతి వస్తువుల పంపిణీని కాంట్రాక్టు ఇవ్వడంతో నాసిరకం వస్తువులను సరఫరా చేశారన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు పరిసెంటేజ్‌లకు పాల్పడడంతో ప్రజలకు బూజుపట్టిన వస్తువులను పంపిణీ చేస్తున్నట్లు విమర్శించారు. బ్యాగులు మాత్రమే నాణ్యతగా ఉన్నాయని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, టిడిపి ఎమ్మెల్యేలు, నాయకులు సంక్రాంతి కానుకలను తీసుకొని ఒకరోజు వంట చేసుకొని తింటే ఎంత నాణ్యతగా ఉన్నాయో అర్థమవుతుందన్నారు. పబ్లిసిటీపై ఉన్న శ్రద్ధ వస్తువుల నాణ్యతపై ప్రభుత్వానికి లేదన్నారు. రూ.350 కోట్లతో ఓ ప్రాజెక్టును కడితే శాశ్వతంగా ఉంటుందన్నారు. వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, తమ్మడపల్లె వెంకటరామిరెడ్డి, చెర్లోకొత్తూరు శివరామిరెడ్డి పాల్గొన్నారు.

గని కార్మికులకు కూలిలు పెంచాలి

కొలిమిగుండ్ల : గని కార్మికులకు కూలిలు పెంచాలని సిఐటియు డివిజన్ నాయకులు యం సుధాకర్ అన్నారు. శనివారం బెలుం సిఐటియు కార్యాలయం నందు గని కార్మికులు సమ్మె నిర్వహించారు. సుధాకర్ మాట్లాడుతూ గని కార్మికులకు చాలిచాలని కూలీలతో జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. పెరిగిన నిత్యావసర వస్తువులను దృష్టిలో ఉంచుకొని గని కార్మికులకు కూలీలు పెంచాలని డిమాండ్ చేశారు. నాలుగు రోజుల నుంచి గని కార్మికులు పనులకు వెళ్లకుండా సమ్మె చేస్తున్నారని అన్నారు. గనుల యజమానులు కార్మికుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని త్వరగా పరిష్కరించాలని తెలిపారు. నాయకులు పి.దావీదు, సుబ్బరాయుడు, దానమయ్య, కొండయ్య, గురువయ్య, రమేష్, పాల్గొన్నారు.

టిడిపితోనే అభివృద్ధి



పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బిసి జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె : టిడిపి పాలనలోనే అభివృద్ధి సాధ్యమని, రూ.2 కోట్లతో తమ్మడపల్లె గ్రామంలో వంద శాతం సీసీ రోడ్లు వేయనున్నట్లు ఎమ్మెల్యే బిసి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఇల్లూరు కొత్తపేట, తమ్మడపల్లె గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. తమ్మడపల్లెలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బిసి జనార్దన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలో రూ.35 లక్షలతో వేసిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.35 లక్షలతో సీసీ రోడ్లు వేశామని, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.50కోట్లు మంజూరు చేశామని, మరో రూ.50 లక్షలు మంజూరు చేసి గ్రామంలో మట్టి రోడ్లు లేకుండా వందశాతం సీసీ రోడ్లు వేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. తమ్మడపల్లె గ్రామ పంచాయతీలో శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.1.04కోట్లు మంజూరు చేశామన్నారు. త్వరలో టెండర్లు పిలువనున్నట్లు ఆయన తెలిపారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ కోడి నాగరాజు యాదవ్, మాజీ సర్పంచి జనార్దన్‌రెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కె నడిపి భూషన్న, ఎంపిడిఒ వెంకటరెడ్డి, తహశీల్దార్ నూకరాజు, మండల ఇంజినీర్ నాగశ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సాయిక్రిష్ణ, హౌసింగ్ ఎఇ రామసుబ్బన్న, యంఇఒ స్వరూప, ఎపిఒ ప్రతాప్, ఎపిఎం నాగరాజు, నాయకులు సుదర్శన్‌రెడ్డి, నెహ్రూ, బోధనం బాలనాగన్న, బాలనాయుడు, మంగంపేట శ్రీనివాసులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే బిసి జనార్దన్‌రెడ్డి సమక్షంలో వైసిపి నుంచి 35 కుటుంబాలు టిడిపిలో చేరారు. గ్రామానికి శివరామిరెడ్డి, మహేశ్వరరెడ్డి, సుభాష్‌రెడ్డి, మద్దిలేటియాదవ్, గోపాల్ యాదవ్, రాధాక్రిష్ణ యాదవ్, బోయ రాముడు, బోయ మోహన్, నాగిరెడ్డి, సుంకన్నల ఆధ్వర్యంలో 35 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరారు.

అవుకు : చంద్రన్న బీమా పేద ప్రజలకు వరం లాంటిదని ఎమ్మెల్యే బిసి జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం శివవరం గ్రామంలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు శాఖలపై రివ్యూలు నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో రూ.కోటి 20 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని, రుణమాఫీ కింద రూ.1 కోటి 11 లక్షల 68వేల జరిగిందని, చంద్రన్న బీమా కింద సాధారణ మరణానికి రూ.2 లక్షలు మంజూరైందని తెలిపారు. ముదిగేడు నుంచి అవుకు వరకు రూ.4 కోట్లతో, బొందలదిన్నె నుంచి గులాంనబీపేట వరకు రూ.2కోట్లతో సీసీ రోడ్డును మంజూరు చేయించానని అన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున టెండర్లు పిలువలేక పోయామన్నారు. వైసిపి నాయకులు దీన్ని ఒక బుతద్దంలో చూపిస్తు కల్లబొల్లి మాటలు చెబుతున్నారని విమర్శించారు. నిరంతరం గ్రామాలభివృద్ధికి కృషి చేస్తుంటే కొందరు విమర్శించడానికి ఉన్నారని ఎద్దేవా చేశారు. గ్రామంలో 48 పొదుపు గ్రూపులు ఉన్నాయని అన్నారు. 32 గ్రూపులు బ్యాంకులో రుణాలు తీసుకొని సరిగా కట్టలేదన్నారు. బ్యాంకుల నుంచి రుణం తీసుకొని కట్టకపోతే అది మీకే కాక ప్రభుత్వానికి నష్టమని మహిళలు అర్థం చేసుకోవాలన్నారు. అనంతరం మహిళకు చంద్రన్న సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. వ్యవసాయశాఖ నుంచి రెండు ట్రాక్టర్లను రైతు రథం పథకం కింద అందించారు. నోడల్ అధికారి విశ్వనాథ్‌రెడ్డి, వ్యవసాయాధికారి శ్రీకృష్ణ, తహశీల్దార్ సంజీవయ్య, ఇఒపిఆర్‌డి రంగ నాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కరిముల్లా, టిడిపి మండల కన్వీనర్ మోట్ల రామిరెడ్డి, జన్మభూమి కమిటీ సభ్యులు బాలిరెడ్డి, సర్పంచి వ్యాపార్ల భవ్య, ఎపిఒ ప్రకాష్‌రావు, ఎపిఎం జ్యోతి పాల్గొన్నారు.


డోన్ : జన్మభూమి ద్వారా ప్రజల సమస్యల పరిష్కారం కోసం తమ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్సీ శమంతకమణి, డోన్ నియోజకవర్గ ఇన్‌చార్జి కెఇ.ప్రతాప్ తెలిపారు. శనివారం 10వ వార్డులో జరిగిన జన్మభూమి కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.



ప్యాపిలిలో పత్రాలను అందజేస్తున్న నాగేశ్వరరావు

కొత్తబురుజు, కోట్రాయి గ్రామాల్లో జరిగిన జన్మభూమి కార్యక్రమాలకు ఎంపిడిఒ ఖ్యాదరీన్, తహశీల్దార్ ముని క్రిష్ణయ్య పాల్గొన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాయత్రిదేవి, ఇఒఆర్‌డి మణిమంజరి, మండల ఎఇ నారాయణ, సర్పంచులు వెంకటరాముడు, బావిరెడ్డి పాల్గొన్నారు.

ప్యాపిలి : ప్రజల అభివృద్ధే టిడిపి ప్రభుత్వ లక్ష్యమని జిల్లా గొర్రెల సంఘం అధ్యక్షులు నాగేశ్వరరావు యాదవ్, జన్మభూమి కమిటీ సభ్యుడు మాజీ ఎంపిపి టి శ్రీనివాసులు అన్నారు. శనివారం నెరేడుచర్ల గ్రామంలో తహశీల్దార్ గోవింద్‌సింగ్, బూరగలలో ఎంపిడిఒ అమృతరాజ్, కౌలపల్లెలో నోడల్ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆధ్వర్యంలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి అల్లిపీర్, పంచాయతీ రాజ్ ఎఇ గణేష్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. బూరుగల, కౌలపల్లె పంచాయతీ కార్యదర్శి ప్రాన్సిస్, నెరేడుచర్ల పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, జన్మభూమి కమిటీ సభ్యులు నెరేడుచర్ల వెంకటేష్, పెద్దారెడ్డి, సర్పంచి రామక్రిష్ణ, నెరేడుచర్లలో నెరేడుచర్ల వెంకటేశ్వర్లు, సర్పంచి రామక్రిష్ణ, టిడిపి నాయకులు పెద్దారెడ్డి, బూరుగలలో టిడిపి నాయకులు కాటం రామక్రిష్ణారెడ్డి, చిన్నిక్రిష్ణ, మధు, చిన్న, కౌలుపల్లెలో శివారెడ్డి, టిడిపి నాయకులు రామేశ్వర్‌రెడ్డి, ప్యాపిలి రామ్మోహన్ యాదవ్, గండికోట సుబ్బయ్య పాల్గొన్నారు.



డోన్‌లో రేషన్‌కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్సీ కెఇ

ప్రజాసమస్యలపై అధికారుల నిలదీత


అధికారులు, నాయకులను నిలదీస్తున్న వేంపెంట గ్రామస్తులు

ప్రజాశక్తి-పాములపాడు

పాములపాడు మండలంలోని వేంపెంట జన్మభూమిలో అధికారులు, నాయకులను సమస్యల పట్ల గ్రామస్తులు నిలదీశారు. ప్రసంగాలు కాదని, సమస్యలు పరిష్కరించాలని నిలేశారు. గత జన్మభూమి కార్యక్రమాల్లో ప్రసంగాలు కొనసాగించి కార్యక్రమాన్ని ముగించుకుని వెళ్లారని, ఈ జన్మభూమిలో తమ సమస్యలు వినాలని అధికారులు, నాయకులను ప్రజలు నిలదీశారు. గ్రామ సమస్యలపై మాట్లాడేందుకు అంగీకరించడంతో సభ సాగింది. వేంపెంట గ్రామంలో శనివారం సర్పంచి టి.రామసుబ్బమ్మ అధ్యక్షతన జన్మభూమి జరిగింది. టిడిపి నందికొట్కూరు ఇన్‌ఛార్జి మాండ్ర శివానందరెడ్డి, జడ్‌పిటిసి దుష్యంత్‌రెడ్డి, ఎంపిటిసి లక్ష్మీకాంతారెడ్డి, నోడల్ అధికారి మస్తాన్‌వలీ, ఆయా శాఖలాధికారులు హాజరయ్యారు. గ్రామస్తులు శ్రీనివాసులు, సామ్యేలు, ఏసురత్నం మాట్లాడారు. మొక్కజొన్న ధాన్యాన్ని కొనుగోలు చేసిన ఐకెపి అధికారులు రైతుల ఖాతాలో అమౌంట్ చెల్లించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ జాప్యానికి కారణాలు చెప్పాలన్నారు. పవర్‌ప్లాంట్ నిర్మాణానికి వ్యతిరేకంగా 1030 రోజులుగా దీక్షలు చేస్తున్నప్పటికీ అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడంపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు. అనంతరం మాండ్ర మాట్లాడారు. పవర్‌ప్లాంట్ నిర్మాణ సమస్య ఎన్‌హెచ్‌ఆర్‌సి పరిధిలో జడ్జి ఎదుట ఉందని, ఆ సమస్య అక్కడే పరిష్కారమవుతుందని తెలిపారు. మొక్కజొన్న రైతులకు డబ్బులు వచ్చే విధంగా మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. గ్రామస్తులు బ్రిడ్జి, సిసి రోడ్లు కోరగా సమస్య పరిష్కరిస్తానని హామీఇచ్చారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రేషన్‌కార్డులు, సంక్రాంతి, ఉపకార వేతనాల పంపిణీ చేశారు.

ఆత్మకూరు : ఆత్మకూరు నగర పంచాయతీ పరిధిలోని 9, 10వ వార్డులో కౌన్సిలర్ రాజగోపాల్, షేక్, ఖైరూన్‌బీ అధ్యక్షతన జన్మభూమి సాగింది. అనంతరం గర్భిణులకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సీమంతం నిర్వహించారు. మాజీ ఎంపిపి వంగాల శివరామిరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు జడ్.శ్రీనివాసురెడ్డి, డిటిఒ లోకేష్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి, వివిధ శాఖలాధికారులు పాల్గొన్నారు. అలాగే సిద్ధేపల్లి గ్రామంలో జరిగిన జన్మభూమి కార్యక్రమానికి నోడల్ అధికారి సత్యరాజు, ఎంపిడిఒ శశికళ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టు : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు జీవులనాయక్ తెలిపారు. సున్నిపెంట లేబర్ కాలనీ పాఠశాలలో జన్మభూమి జరిగింది. తహశీల్దార్ శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. డాక్టర్ సోమశేఖరయ్య ఆరోగ్యశ్రీ కార్డుపై ప్రభుత్వం అందిస్తున్న విధానంపై వివరించారు. ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ లావణ్య వివిధ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. ఎఎంఒ హుసేనమ్మ మాట్లాడుతూ... ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసర ప్రాంతాల శుభ్రతను పాటించాలని తెలిపారు. గృహనిర్మాణ ఎఇ కృష్ణమూర్తి, జీవులనాయక్ మాట్లాడారు. అనంతరం ఎన్‌టిఆర్ గృహాలు, పింఛన్లు, రేషన్‌కార్డులకు దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చంద్రన్న బీమా పథకం పత్రాలు, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందజేశారు. డిప్యూటీ డిఎంహెచ్‌ఒ లక్ష్మణ్‌నాయక్, విద్యుత్ ఎఇ అశోక్‌నాయక్, అటవీశాఖ ఎఫ్‌ఎస్‌ఒ ఠాగూర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అంజనీదేవి, పొదుపు మహిళలు, ఎపిఎం సుబ్బన్న, టిడిపి నాయకులు మహ్మద్‌కాశీం, మైలా శ్రీను, గ్రామాభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి కత్తుల కోటేశ్వరరావు, ఎస్‌ఇ నాయకులు జీవరత్నం, రెవెన్యూ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు : కాకనూరు, యర్రగుంట్ల గ్రామాల్లో సర్పంచులు జక్కం శివారెడ్డి, లక్ష్మిదేవమ్మ అధ్యక్షతన జన్మభూమి సాగింది. గుంటూరు డిఐజి కెవివి.గోపాలరావు మాట్లాడారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. తహశీల్దార్ సుధాకర్, ఎంపిడిఒ సుబ్బమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సుబ్రమణ్యం, పిఆర్ ఎఇ వెంకటరెడ్డి, హౌసింగ్ ఎఇ వాసుదేవుడు, పంచాయతీ కార్యదర్శి అంకన్న, విఆర్‌ఒ వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరస్వతి, బండిఆత్మకూరు పిహెచ్‌సి డాక్టర్ కాంతారావు పాల్గొన్నారు.

మిడుతూరు : మండలంలోని చౌట్కూరు, బన్నూరు గ్రామాల్లో జన్మభూమి సాగింది. చౌట్కూరులో 223 అర్జీలు వచ్చాయని తహశీల్దార్ భూలక్ష్మీ తెలిపారు. గ్రామంలో సిసి రోడ్లు సరిగా లేవని ప్రజలు తెలిపారు. బన్నూరులో డ్రెయినేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. నోడల్ అధికారి జయప్రద, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వెంకటేశ్వరరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కిరణ్, ఎంఇఒ మౌలాలి, సర్పంచులు బీబీ, వెంకటరమణ, విఆర్‌ఒ ఖాజా పాల్గొన్నారు.

కొత్తపల్లి : మండలంలోని ఎదురుపాడులో సర్పంచి సుజిత ఆధ్వర్యంలో జన్మభూమి జరిగింది. నోడల్ ఆఫీసర్ సుబ్బారావు, ఎంపిడిఒ కమలాకర్, తహశీల్దార్ రామకృష్ణ మాట్లాడారు. అనంతరం చెక్కులు, స్కాలర్‌షిప్పులు, చంద్రన్న సంక్రాంతి కానుక కిట్లను పంపిణీ చేశారు. ఎఒ నాగేంద్రప్రసాద్, ఎపిఎం ఉమామహేశ్వరి, ఎపిఒ ఉషారాణి, పిఆర్ ఎఇ రామచంద్రయ్య, హౌసింగ్ ఎఇ రంగస్వామి, ఇఒఆర్‌డి విజయభాస్కర్, ఆయా శాఖలాధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పగిడ్యాల : ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందించే బాధ్యత మనందరిపై ఉందని నోడల్ అధికారి వీరారెడ్డి తెలిపారు. ముచ్చుమర్రి గ్రామంలో ఎంపిపి పుల్యాల దివ్య అధ్యక్షతన జన్మభూమి జరిగింది. అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆత్మకూరు : 4వ విడత జన్మభూమిలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులకు పరిష్కారం ఎక్కడ అని సిపిఎం పట్టణ కార్యదర్శి వి.ఏసురత్నం, నాయకులు రణధీర్ అధికారులను నిలదీశారు. శనివారం పట్టణంలోని 10వ వార్డులో జరిగిన జన్మభూమిలో సిపిఎం గరీబ్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో ఇచ్చిన అర్జీలకు పరిష్కారం చూపకపోవడంతో అధికారులను నిలదీశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వి.ఏసురత్నం మాట్లాడారు. గరీబ్‌నగర్‌లో పైపులైన్ల మరమ్మతుల సమస్య 4 నెలలైనా పరిష్కారం కాలేదని, ప్రజలు మురికి నీరు వాడుకుంటున్నారని తెలిపారు. అన్ని వీధుల్లో సిసి రోడ్లు వేసి డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వాస్పత్రిని 30 పడకల నుంచి 100 పడకలకు మార్చి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఏరియా హాస్పిటల్‌గా మార్చి ఆవరణలో మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసి రక్తనిధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు సురేంద్ర, శ్రీధర్, ఇస్మాయిల్, శివనాయక్ పాల్గొన్నారు.


అధికారులను నిలదీస్తున్న సిపిఎం నాయకులు ఏసురత్నం


క్యాంపస్ సెలక్షన్లు చేస్తున్న దృశ్యం

ఐఎల్‌ఎం క్యాంపస్ ఎంపికలో బసిరెడ్డి విద్యార్థుల హవా

ప్రజాశక్తి-నందికొట్కూరు

ఐఎల్‌ఎం క్యాంపస్ ఎంపికలో బసిరెడ్డి కళాశాల విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఎన్నికయ్యారు. శనివారం పట్టణంలోని స్థానిక బసిరెడ్డి డిగ్రీ మెమోరియల్ డిగ్రీ కళాశాలలో బెంగళూరుకు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. ఐఎల్‌ఎం హెచ్‌ఆర్ గౌస్‌పేస్ పాల్గొన్నారు. ఈ సెలక్షన్స్‌కు 494 మంది విద్యార్థులు హాజరు కాగా 43 మంది బసిరెడ్డి కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ఛైర్మన్ శ్రీధర్‌రెడ్డి, కరస్పాండెంట్ లాయర్ సత్యనారాయణ తెలిపారు. ఎక్కువ సంఖ్యలో తమ విద్యార్థులు ఎంపికైనందుకు గర్వంగా ఉందని, ప్రతేడాది ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. కళాశాల డైరెక్టర్లు రమేష్‌రెడ్డి, బి.శ్రీకాంత్, శ్రీనాథ్, జాన్ ఎలీషా బాబు, వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కంది, శనగకు మద్దతు ధర ప్రకటించండి

మిడుతూరు : కంది, శనగ పంటలకు మద్దతు ధర ప్రకటించాలని ఎపి రైతుసంఘం నాయకులు వెంకటేశ్వర్లు, మండల నాయకులు విజయ్, ఓబులేసు కోరారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడారు. మండలంలో వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో అరకొర పంటలు పండాయని, పండిన పంటలకు గిట్టుబాటు ధరలేదని తెలిపారు. ప్రస్తుతం కంది క్వింటా రూ.3 వేల నుంచి రూ.3500 వరకూ ఉందని, శనగ రూ.4 వేల నుంచి రూ.4500 వరకూ ఉందని చెప్పారు. ప్రభుత్వం స్పందించి కందికి రూ.6 వేలు, శనగకు రూ.7 వేల మద్దతు ధర ప్రకటించాలని కోరారు. రవి, రామకృష్ణ, తిరుపాలు, రమణయ్య, నాగరాజు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సెపక్‌తక్రా శిక్షణ శిబిరం ప్రారంభం

నందికొట్కూరు : పట్టణంలోని నవనంది పాఠశాలలో 20వ జాతీయ సెపక్‌తక్రా జాతీయ సబ్ జూనియర్ పోటీలకు శిక్షణ శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ కెఎల్‌ఎన్.రెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరానికి రాష్ట్రంలోని పది జిల్లాల నుంచి 80 మంది విద్యార్థులు వచ్చారనినవనంది కరస్పాండెంట్ శ్రీధర్ తెలిపారు. ఇందులో నిష్ణాతులైన శిక్షకుల చేత శిక్షణ ఇప్పించి జాతీయస్థాయికి ఆంధ్ర రాష్ట్రం నుంచి వెళ్లే విధంగా బాలికలను తీర్చిదిద్దుతామన్నారు. జిల్లాస్థాయి అధికారులు, పిఇటిలు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

వెలుగోడు : ఈనెల 10, 11, 12న ఆలూరులో జరిగే సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం మండల కన్వీనర్ యాదాటి నాగేంద్రుడు కోరారు. శనివారం సిఐటియు కార్యాలయంలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ... ఈ మహాసభల్లో జిల్లా అభివృద్ధిపై సమీక్షిస్తామని తెలిపారు. ఈ మహాసభలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్, రాష్ట్ర కమిటీ సభ్యులు షడ్రక్, జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. రఫీ, రామాంజనేయులు, శివశంకర్ పాల్గొన్నారు.


పోస్టరు ఆవిష్కరిస్తున్న నాయకులు

మరుగుదొడ్ల నిర్మాణానికి సాంకేతిక లోపాలు తొలగించాలి

నందికొట్కూరు : పేదలు నిర్మించుకుంటున్న మరుగుదొడ్లకు కంప్యూటర్‌లో తలెత్తుతున్న సాంకేతిక లోపాలను తొలగించాలని రైతుసంఘం డివిజన్ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు కోరారు. శనివారం పట్టణంలో జన్మభూమిలో రైతుసంఘం డివిజన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు డిఇ నాగభూషణ్‌రెడ్డి, కమిషనర్ కెఎల్‌ఎన్.రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేదలు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ప్రభుత్వం కార్యక్రమం చేపట్టినప్పటికి సమస్యలతో నిర్మించుకోలేక పోతున్నారని తెలిపారు. అధికారులు దృష్టి సారించి చిన్న, చిన్న సమస్యలను తొలగించి ప్రతి కుటుంబం మరుగుదొడ్డి నిర్మించుకునేలా అవకాశం కల్పించాలని కోరారు. డిఇ నాగభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యలను తొలగించి వారికి న్యాయం చేస్తామన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

విద్యారంగ సమస్యలపై స్పందించాలి

ప్రజాశక్తి-వెలుగోడు

విద్యారంగ సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి శివశంకర్ కోరారు. శనివారం సిఐటియు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఆత్మకూరులో ఉన్న సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ప్రారంభానికి వస్తున్న ముఖ్యమంత్రి విద్యారంగ సమస్యలపై పెదవి విప్పాలని కోరారు. వెలుగోడులో విద్యా వసతులు లేవని తెలిపారు. పాలిటెక్నిక్, పిజి, మహిళ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, ఈ కళాశాలలు లేక విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని చెప్పారు. ఉన్నత విద్య కోసం నంద్యాల, కర్నూలు తదితర ప్రాంతాలకు వెళ్తున్నారని తెలిపారు. మండల నాయకులు విజయ్, లక్ష్మీనారాయణ, నరేంద్ర పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్‌ది కీలకపాత్ర

కొత్తపల్లి : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్ కీలకపాత్ర పోషించిందని ఎంఇఒ శ్రీరాములు, యుటిఎఫ్ నాయకులు బాలాజీరావు తెలిపారు. శనివారం కొత్తపల్లిలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాడేది యుటిఎఫ్ అన్నారు. ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేయాలన్నారు. పిఆర్‌సి బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ప్రతేడాది డీఎస్సీ విడుదల చేసి ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలన్నారు. యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి మాలిక్‌బాష, యుటిఎఫ్ ఉపాధ్యాయ బృందం బివి.రమణ, జి.సోమశేఖర్, ఇస్సాక్, మల్లికార్జున, సుబ్బారెడ్డి, నాగరాజు నాయక్, ఎంఆర్‌సి సిబ్బంది షరీఫ్, జబీవుల్లా, నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలవరం పూర్తి చేయాలని రఘువీరారెడ్డి పాదయాత్ర

వెలుగోడు : పోలంవరం ప్రాజెక్టు పూర్తి చేయాలని పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి ఈనెల 7, 8, 9న పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ శ్రీశైలం ఇన్‌ఛార్జి చింతల మోహన్‌రావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. ధవళేశ్వరం నుంచి పోలవరం వరకూ పాదయాత్ర నిర్వహించి ఈనెల 10న సామూహిక నిరాహారదీక్ష నిర్వహిస్తారని తెలిపారు. కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, కళ్లెం రాజు, బాపిరాజు పాల్గొంటారన్నారు. యూత్ ప్రెసిడెంట్ హకీం, అస్లాం పాల్గొన్నారు.

శ్రీశైలంలో మహబూబ్‌నగర్ జెసి

శ్రీశైలం : మహబూబ్‌నగర్ జెఇస కృష్ణ ఆదిత్య శనివారం భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్లను దర్శించుకున్నారు. వీరు స్వామి, అమ్మవార్ల దర్శనార్థమై ఆలయం వద్దకు చేరుకోగా ఆలయాధికారులు స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

ప్రమాదాలు జరిగితే అంతేనా..?

గ్రామానికి వెళ్లి పరామర్శించని ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి-హొళగుంద

ప్రమాదాలు జరిగితే ఇంతేనా. ప్రమాద బాధిత కుటుంబాలను అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంతవరకు గ్రామాలకు వెళ్లి పరామర్శించకపోవడం అందరిని ఆశ్చర్యాన్ని గురిచేస్తుంది. పొట్ట కోసం సంకలో సంచులు పెట్టుకొని చిన్నారులను సైతం తమతో తీసుకెళ్లి వలసలు వెళుతున్నారు. మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన 30 మంది వలస కూలీలు నల్గొండ జిల్లాలో పత్తి పనులకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఈనెల 3న 30 మంది టిప్పర్లో వస్తుండగా బోల్తా పడి ఏడుగురు మృతి చెందారు. కొందరు గాయాలపాలయ్యారు. అందులో చిన్నారి స్రవంతి(8) శనివారం ఉదయం 8 గంటల సమయంలో కర్నూలు ఆసుపత్రిలో కోలుకోలేక మృతి చెందింది. ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా ఎన్నికల సమయంలో మేమున్నామని ఎన్నో వాగ్దానాలు చేస్తున్నారు. కొత్తపేట గ్రామంలో 8 మంది మృతి చెందితే నేటికీ ఏఒక్క ప్రజాప్రతినిధి కూడా గ్రామానికొచ్చి బాధితులను పరామర్శించి వారి బాధలను అడిగి తెలుసుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ.5 లక్షలు చొప్పున అందించాలని బాధితుల తరపున గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నా ఏ ఒక్కరు నోరు మెదపకపోవడంతో మా బాధలు ఎవరికి చెప్పుకోవాలని బాధితులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం ఉదయం గ్రామంలో ఎంపిటిసి భీమన్న, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్‌కె గిరి ఆధ్వర్యంలో గ్రామస్తులు బాధితులకు న్యాయం చేయాలని గ్రామస్తులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు.



బాధితులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మృతి చెందిన బాధిత కుటుంబాలకు ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భంభంస్వాముల ఆరాధనోత్సవాలు

ప్రజాశక్తి-ఆదోని



పట్టణంలో ఆలూరు రోడ్డులోని కల్లుబావి ప్రాంతంలో శ్రీభంభంస్వాముల ఆశ్రమంలో శ్రీభంభంస్వాముల ఆరాధనోత్సవాలు ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు వగ్గా తిక్కస్వామి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ సద్గురు భంభం స్వాముల వారి ఉరుసు ఆరాధనల సందర్భంగా ప్రత్యేక పూజలు, మహా మంగళ హారతులు, దీపారాధన నిర్వహిస్తామన్నారు. చిప్పగిరిలో నుంచి గంధం తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. 8న రాత్రి పెసలబండ, సుల్తాన్‌పురం, కపటి, బసాపురం, కల్లుబావి తదితర గ్రామాల నుంచి శిష్య భక్తులతో అఖండ భజన కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. సోమవారం 9న ఆశ్రమంలో గురువులకు గురుపూజలు నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేస్తారన్నారు. ఆరాధనోత్సవాల్లో శిష్య భక్తులు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కెవిపిఎస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ఆదోని: మహిళలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కెవిపిఎస్ ఆధ్వర్యంలో శనివారం సంతేకుడ్లూరు గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యార్థినులు, మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించినట్లు కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహానంది, డివిజన్ కార్యదర్శి తిక్కప్ప తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు క్రీడల్లో కూడా రాణిస్తే దేశ ప్రగతి సాధ్యమన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్లు, యుటిఎఫ్ నాయకులు రుద్రముని, అంగన్‌వాడీ టీచర్, ఎస్తేరమ్మ, టిడిపి నాయకులు మల్లికార్జున, మాజీ ఎంపిటిసి ఖాసీం, కెవిపిఎస్ నాయకులు శ్రీనివాసులు, ఆంజనేయులు, సతీష్, పరమేష్, కార్తీక్, విద్యార్థినులు, మహిళలు పాల్గొన్నారు.

పులికనుమ ప్రాజెక్టు నుంచి సాగు, తాగునీరందించాలి

కోసిగి: మండల రైతులు, ప్రజలకు ప్రాజెక్టు నుంచి తూము ఏర్పాటు చేసి సాగు, తాగు నీరందించాలని పులికనుమ తూము సాధన కమిటీ సభ్యులు లంకారెడ్డి, లక్ష్మన్న, హనుమంతు, లక్ష్మిరెడ్డి, లోకేష్ శనివారం పల్లెపాడులో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండల రైతులకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారమన్నారు. తుంగభద్ర నది కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఉన్నా రైతులు సాగు నీటికి నోచుకోకపోవడం విచారకరమన్నారు. ఇక్కడ రైతులు కేవలం వర్షంపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారన్నారు. వర్షాలు సరిగా కురవకపోతే అప్పులపాలవుతున్నారు. చదువుకున్న పిల్లలతోపాటు దూర ప్రాంతాలకు వలసలు పోతున్నారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం వందలాది ఎకరాలు రైతులు భూములు కోల్పోయారన్నారు. దీంతో సాగుకు నోచుకోకపోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక తూము ఏర్పాటు చేసి సాగు, తాగునీరందించాలని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తూమును ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని టిడిపి కార్యదర్శి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు.

గొడవలు సృష్టించొద్దు

నందవరం: జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో వ్యక్తిగత కారణాలతో గొడవలు సృష్టించవద్దని తహశీల్దార్ ఎం.ఈరన్న అన్నారు. శనివారం కొత్త నదికైరవాడి గ్రామంలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు తెలపాలే తప్పా వ్యక్తి కారణాలతో అధికారులపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి కూలీలు రాలేదని, ఇంకుడు గుంతల డబ్బులు రాని మాట వాస్తవమని, ఉపాధి పథకంలో కూలీల వేతనాలు నిలిచిపోయారన్నారు. అర్జీలను ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. 40 కొత్త పెన్షన్లు, 70 రేషన్ కార్డు లకు అర్జీలు వచ్చాయని, వాటిని ఆన్‌లైన్‌చేసి మంజూరుకు చర్య లు తీసుకుంటామన్నారు. అనంతరం ఆనందలహరి పథకం ద్వారా ఎంపికైన కొత్త కైరవాడి, కొట్టాలలో కార్యక్రమాన్ని చేపట్టారు.

ప్రజా సమస్యలు పట్టించుకోని అధికారులు

రసాభాసగా మారిన జన్మభూమి



దేవనకొండ: ప్రజా సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని తెర్నేకల్లు గ్రామస్తులు, సిపిఎం నాయకులు రాఘవరెడ్డి, పరమేష్ ధ్వజమెత్తారు. జన్మభూమి మాఊరు కార్యక్రమంలో మండలంలోని తెర్నేకల్లు, పాలకుర్తి గ్రామాల సర్పంచులు రాజన్న, సుధారాణి అధ్యక్షతన జరిగింది. తెర్నేకల్లు గ్రామంలో జరిగిన జన్మభూమిలో గ్రామస్తులు, సిపిఎం నాయకులు మాట్లాడుతూ హంద్రీనీవా కాలువలను పూర్తిచేసి రైతులకు సాగు, చెరువులకు నీటిని ఇవ్వాలని, శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని, హంద్రీ వాగులో కంప చెట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. సమస్యలను చెప్పుకోవడానికి గ్రామస్తులు ముందుకొస్తే మండల నోడల్ అధికారి పార్వతీదేవి స్పందించకపోవడంతో సమావేశం రసాభాసగా మారింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాలకుర్తి గ్రామంలో జన్మభూమి అధికారుల ప్రసంగాలతోనే తూతూమంత్రంగా ముగిసింది. ఆయా కార్యక్రమాల్లో ఎంపిపి రామచంద్రనాయుడు, ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ మహబూబ్‌బాషా, డిప్యూటీ తహశీల్దార్ ఆదినారాయణ, పశువైద్యాధికారి బాలకృష్ణ, పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇలు మహబూబ్‌బాషా, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎపిఒ కృష్ణమోహన్, ఎంఇఒ యోగానంద్, ఎపిఎం వందన పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పెద్దకడుబూరు



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

ఆలూరులో జరిగే సిపిఎం 21వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం మండల కన్వీనర్ తిక్కన్న కోరారు. శనివారం మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎదుర్కొంటు నిజాయితీగా సిపిఎం ప్రజల తరుపున పోరాటాలు చేస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేటికీ నెరవేర్చలేదన్నారు. ఈనెల 10, 11, 12 తేదీల్లో ఆలూరులో సిపిఎం 21వ జిల్లా మహాసభలు జరుగుతాయని, ఈ మహాసభల్లో పశ్చిమ ప్రాంత రైతులు, కార్మికులు, గ్రామాల్లో సాగు, తాగునీరు, వలస నివారణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చ జరుగుతుందన్నారు. 10న జరిగే ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేసేందుకు సిపిఎం కార్యకర్తలు, సానుభూతిపరులు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామన్న, సిపిఎం నాయకులు పరమేష్, ఆనంద్‌రాజు, నరసింహులు పాల్గొన్నారు.

అధికారమొకరిది.. పెత్తనం మరొకరిది...

ఆలూరురూరల్: మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయమని ఊకదంపుడు ఉపన్యాసాలు మాటలకే పరిమితమవుతున్నాయి. మహిళా ప్రజాప్రతినిధుల హక్కులను కాపాడాల్సిన అధికారులే తూట్లు పొడుస్తుంటే మహిళలు రాజకీయ రంగంలో రాణించడం సాధ్యంకాని పరిస్థితి. ఆలూరు మండలంలోని కమ్మరచేడు గ్రామంలో శనివారం జరిగిన జన్మభూమి గ్రామసభలో అధికారులే మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో వారి కుటుంబసభ్యులకు పెద్దపీట వేశారు. గ్రామసభలో సర్పంచి నీలమ్మ స్థానంలో ఆమె కుమారుడు సోమశేఖర్, ఎంపిటిసి తులసమ్మ స్థానంలో ఆమె మరిది దేవేంద్రప్ప పాల్గొన్నారు. జన్మభూమిలో పాల్గొనడమే కాకుండా వారే అంతే కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం. గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో ఆశించిన స్థాయిలో ఉండటంతో అందుకు కృషి చేసిన సర్పంచి నీలమ్మను, పంచాయతీ కార్యదర్శి విజయ్‌ను సన్మానించాల్సిన అధికారులు సర్పంచి స్థానంలో ఆమె కుమారుడు సోమశేఖర్‌ను సన్మానించడం గమనార్హం. ప్రభుత్వ అధికారులే ఈ విధంగా వ్యవహరిస్తే మహిళా ప్రతినిధులు రాజకీయాల్లో రాణించడం ప్రశ్నార్థకమే. ఇప్పటికైనా వారిని గ్రామ సభలు, అధికారుల సమావేశాల్లో వారి వాణి వినిపించేందుకు అధికార యంత్రాంగం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అన్ని వర్గాల అభివృద్ధే టిడిపి ధ్యేయం



మాట్లాడుతున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

ఆస్పరి : అన్ని వర్గాల అభివృద్ధే టిడిపి ధ్యేయమని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి వీరభద్రగౌడ్, జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, శాలివాహన ఫెడరేషన్ ఛైర్మన్ తుగ్గలి నాగేంద్ర అన్నారు. శనివారం కారుమంచి గ్రామంలో సర్పంచి వెంకమ్మ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో వారు మాట్లాడారు. నవ్యాంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిలో నిలిపేందుకు సిఎం బాబు కృషి చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ అప్పుల్లో ఉన్నా సంక్షేమ పథకాలను అందిస్తునే రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. జన్మభూమి కార్యక్రమం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు, గృహాలు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 19 లక్షల ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రైతులకు రుణమాఫీ, డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ చేశామన్నారు. రైతులకు సేద్యం చేసుకునేందుకు సబ్సిడీ కింద ట్రాక్టర్లు పంపిణీ చేస్తున్నామన్నారు. రాష్ట్రం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని ప్రతి ఒక్కరు బలపరచాలన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ చెంగల్‌రాయుడు, జడ్‌పిటిసి కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఎంపిపి రత్నమ్మ, ఎస్సీ, ఎస్టీ డైరెక్టర్ ప్రభాకర్, ఎంపిడిఒ సలీంబాషా, తహశీల్దార్ సుబ్రమణ్యం, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి-ఆలూరురూరల్

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఐక్య వేదిక జిల్లా నాయకులు సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం విద్యుత్ భవన్‌లో ఆదోని డివిజన్ ఐక్యవేదిక కన్వీనర్ ఉచ్చారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యుత్ సంస్థ యాజమాన్యానికి, రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ అవార్డులు వచ్చినప్పుడు ఈ అవార్డులు రావడానికి కాంట్రాక్ట్ కార్మికుల కృషి అని అధికారులు, రాజకీయ నాయకులు చెప్పుకోవడం ఆనవాయితీగా మారిందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయడంలో జిఒలు ఆటంకంగా మారుతున్నాయని కుంటి సాకులు చెబుతున్నారన్నారు. అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఏ సంస్థలోనైనా ఓ ప్రభుత్వ ఉద్యోగి చేసే పనిని కాంట్రాక్ట్ కార్మికులు చేసిన వారికి సమాన పనికి సమాన వేతనమివ్వాలని తీర్పు ఇచ్చినా అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అర్థమవుతోందన్నారు. ఇప్పటికైనా సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తమిళనాడు తరహాలో వయస్సు, విద్యార్హతతో నిమిత్తం లేకుండా రెగ్యులర్ చేయాలని లేదా తెలంగాణలో మాదిరిగా సంస్థలో విలీనం చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.20 లక్షల బీమా, కుటుంబానికి శాశ్వత ఉద్యోగం, బిల్ రీడర్స్‌కు, కలెక్టర్లకు, ఎస్‌పిఎంలలో పనిచేసే వారికి పీస్ రేటు రద్దు చేసి కనీస వేతనాలు అమలు చేయాలని తదితర డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 9న ఎస్‌సి జిల్లా విద్యుత్ భవనంలో జరుగు నిరసన కార్యక్రమానికి పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కరించకపోతే 27న ఉదయం 6 గంటల నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో కెవన్ మాబుసాహేబ్, నాగరాజు, రాజశేఖర్, గని, జయరాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ


నిరసన తెలుపుతున్న గంగపుత్రులు

మత్స్యకారులపై ముఖ్యమంత్రి తీరు ఆక్షేపణీయం

ప్రజాశక్తి-మంత్రాలయం

సాంప్రదాయ మత్స్యకారుల పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీరు ఆక్షేపణీయమని సాంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సమాఖ్య జిల్లా కన్వీనర్ బిఎస్ నవీన్‌కుమార్ అన్నారు. శనివారం మత్స్యకారుల జిల్లా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక రాఘవేంద్ర సర్కిల్‌లో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైజాగ్‌లో మత్స్యకారులు తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాతపూర్వకంగా హామీ ఇవ్వాలని కోరడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆగ్రహం వ్యక్తం చేసి భయపెట్టడం విచారకరమన్నారు. వాసుపల్లి గణేష్‌పై దుర్భాషలాడిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మత్స్యకారులను అవమానపరిచేలా వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. వాడిన పదజాలాలను వెనక్కి తీసుకొని బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. అనంతరం రాఘవేంద్ర సర్కిల్‌లో ధర్నా నిర్వహించి తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈరన్న, మంత్రాలయం నియోజకవర్గం అధ్యక్షుడు శాంతయ్య, సర్పంచులు తెల్లబండ్ల భీమయ్య, సుంకప్ప, నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు దేవన్న, పవన్, నరసింహ, రామాంజి, డీలర్ భీమయ్య, ప్రాజేష్, రాఘవేంద్ర, కుమార్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


స్వచ్ఛ మంత్రాలయ నిర్మాణానికి సహకరించండి

మంత్రాలయం: మంత్రాలయ క్షేత్రాన్ని స్వచ్ఛతగా, పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని శ్రీమఠం ఎఎఒ మాధవశెట్టి, మేనేజర్ గిరిధర్, ఆధ్యాత్మిక అధికారి శ్రీపతి కోరారు. శనివారం ప్రధాన రహదారిలో ఉన్న దుకాణాల యజమానులకు చెత్తను వేసేందుకు చెత్త డబ్బాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే ప్రసిద్ధి చెందిన మంత్రాలయ క్షేత్ర పవిత్రను కాపాడేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. చెత్తచెదారాన్ని డబ్బాల్లో వేసి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా ఊరి బయటకు వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీమఠం నుంచి చెత్త డబ్బాలను దుకాణ యజమానులకు అందజేశారు.

5కె రన్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు

పట్టణంలోని ప్రభుత్వ బాలుర కళాశాల మైదానం నుంచి నిర్వహించే 5కె రన్‌ను జయప్రదం చేయాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 6.30 నుంచి 7.30 మధ్య 5కె రన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శాసన సభ్యులు ఎమ్మెల్యే బివి జయనాగేశ్వరరెడ్డి విశిష్ట అతిథిగా, మున్సిపల్ ఛైర్మన్ సాయిసరస్వతి, వైస్ ఛైర్మన్ కొండయ్యచౌదరి, కౌన్సిలర్లు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాన్ని పట్టణ ప్రజలు, యువత, విద్యార్థులు, అధికారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కర్నూలులోనే కల్తీ మద్యం తయారీ

ప్రజాశక్తి-కోసిగి

కోసిగిలోని ఎపి వైన్ షాపులో కల్తీ మద్యం గత 10 రోజుల క్రితం బయట పడింది. రాష్ట్ర ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం పోలీసు కస్టడీకి నిందితుడు వీరారెడ్డిని స్టేట్ ఎన్‌టిఎఫ్ స్క్వాడ్ డిఎస్‌పి రాఘవేంద్ర, సిఐలు కృష్ణమూర్తి, ఇఎస్‌టిఎఫ్ కృష్ణమూర్తి, నాగలక్ష్మి, కృష్ణకుమార్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. నిందితుడు కల్తీ మద్యాన్ని కర్నూలులోని గోరంట్ల కాలనీలో ఒక ఇల్లు అద్దెకు తీసుకొని అక్కడ కల్తీ మద్యాన్ని తయారు చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై సోదాలు నిర్వహించగా ఇంట్లో 33 బాక్సులు, 1584 బాటిల్లు దొరికినట్లు తెలిపారు. నిందితుడిని కోర్టుకు హాజరు పరిచారు.

గందరగోళం మధ్య జన్మభూమి

అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-విలేకరులు

ఆదోనిరూరల్: 5వ రోజు జన్మభూమి గందరగోళం మధ్య ప్రారంభమైంది. శనివారం పెద్దతుంబళం గ్రామంలో ఎంపిడిఒ క్రిస్టాయనమ్మ, కుప్పగల్లులో ఎపిడిఒ మల్లేశ్వరి బృందం, పాండవగల్లులో తహశీల్దార్ శ్రీనాథ్ బృందం బల్లేకల్ ఎఇఒ శ్రీనివాసులు బృందం, అధికారులు ప్రారంభించారు. జన్మభూమి ప్రారంభమైందని అధికారులను గ్రామస్తులు చుట్టుముట్టి గతంలో ఇచ్చిన పింఛన్, రేషన్ కార్డులు, ఇళ్ల తదితర సమస్యలపై అధికారులను నిలదీశారు. అధికారులకు ప్రజాదర్బారుతోపాటు గత జన్మభూమిలో ఇచ్చిన సమస్యలు పరిష్కరించకపోవడం అధికారుల నిర్లక్ష్యమని, 5వ విడత కింద ఏ హామీలను నెరవేరుస్తారని గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు. పంట నష్టపరిహారం విషయంలో అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పెడచెవిన పెడుతున్నారని గ్రామాల్లో అధికారులను నిలదీస్తున్నారు.

పాండవగల్లులో అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు: పాండవగల్లు గ్రామస్తులతోపాటు సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో అధికారులు జన్మభూమికి వస్తున్న సమాచారం తెలుసుకొని ముఖ ద్వారం వద్ద సుమారు గంటపాటు అధికారులను అడ్డుకున్నారు. గ్రామాల్లో నిరు పేదలున్నా పక్కా ఇళ్లటిడిపి నాయకులకే కేటాయించారని, ఉపాధి బకాయిలు కూడా పెండింగులో ఉన్నాయని, పెద్దచెరువు విషయంలో అధికారులు ఒక వ్యక్తికే వత్తాసు పలకడం, ఆ పెద్ద చెరువుల వల్ల గ్రామస్తులు, పశువులకు ఇబ్బంది ఉన్నా అధికారులు మాత్రం ఆ చెరువు వైపు వెళ్లకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం. పాండవగల్లు సర్పంచి వెంకటేష్, నాయకులు గిడ్డయ్య, రామదాసు, తాహేర్‌వలి, గ్రామ సమస్యలపై అధికారులకు విన్నవించినా చేస్తాం చూస్తాం అనడం తప్ప ఆచరణలో శూన్యమన్నారు. అనంతరం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షినాయుడు జోక్యం చేసుకొని పెద్ద చెరువు విషయం హైకోర్టులో ఉన్నం దున అటు అధికారులు ఏం చేయలేకపోతున్నారని, కోర్టు సమస్య పరిష్కమైన వెంటనే ఆ చెరువు సమస్యలను తీరుస్తామన్నారు. ఏదిఏమైనా సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని, పథకాలు కూడా అర్హులకు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో పింఛన్, రేషన్, పక్కా ఇళ్లులేనివారికి అందేలా చూస్తాన న్నారు. అప్పటికీ గ్రామస్తులు వినకపోవడంతో సర్పంచి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సర్పంచులు నేరుగా తీసుకురా వాలని, పంట నష్టపరిహారం రెండ్రోజుల్లో ఖాతాల్లో పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో పరిస్థితి సర్దుమనిగింది. గ్రామాల్లో అధికారులు జన్మభూమిని కొనసాగించారు.

పెద్దతుంబళం గ్రామంలో గందరగోళం: జన్మభూమి కార్యక్రమానికి అధికారులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షినాయుడు, ఉమాపతినాయుడు చేరుకోగానే ఒక్కసారిగా గ్రామస్తులు చుట్టుముట్టి సమస్యలను చెప్పుకున్నారు. సమస్యలు చెప్పినా పదేపదే అధికారుల నిర్లక్ష్యం వల్ల పదేపదే కార్యక్రమాల్లో అర్జీలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు. శాంతియుతంగా ఉంటే సమస్యలకు పరిష్కారం చూపిస్తామని మీనాక్షినాయుడు తెలిపారు. అర్జీలను స్వీకరించి అధికారులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి లక్ష్మి, ఎంపిపి పద్మావతి, ఎంపిటిసి రాజేశ్వరి, నాగరాజు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోసిగి: అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించడమే టిడిపి లక్ష్యమని టిడిపి జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం పల్లెపాడు, జంపాపురం గ్రామాల్లో జన్మభూమి మాఊరు నిర్వహించారు. పల్లెపాడులో జరిగిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించడమే టిడిపి ధ్యేయమన్నారు. సమస్యల పరిష్కారానికి జన్మభూమి చేపట్టామన్నారు. గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రెయినేజీ గ్రామాల్లో చేపట్టామన్నారు. గ్రామాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామానికి కొత్త రేషన్‌కార్డులు 45, పింఛన్లు 35 మంజూరైనట్లు తెలిపారు. అనంతరం


ఆదోనిలో మాట్లాడుతున్న మీనాక్షినాయుడు


కోసిగిలో చంద్రన్న బీమా పథకం పంపిణీ చేస్తున్న దృశ్యం

సంక్రాంతి కానుకలు, చంద్రన్న బీమా పథకం పంపిణీ చేశారు. డ్వాక్రా మహిళలకు 60 గ్రూపుల్లో ఒక్కో గ్రూపుకు రూ.20 వేలు సబ్సిడీ పడిందన్నారు. పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమం సర్పంచి చంద్ర అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ముత్తురెడ్డి, వక్రాణి వెంకటేశ్వర్లు, సాగు నీటి సంఘం అధ్యక్షుడు రామిరెడ్డి, ఎస్సీసెల్ కార్యదర్శి మారెప్ప, జ్ఞానేష్, ఆయా శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హోళగుంద: సమస్యల పరిష్కారానికే జన్మభూమి మాఊరు ఉద్దేశ్యమని నోడల్ అధికారి లక్ష్మిప్రసాద్, తహశీల్దార్ సతీష్, ఎంపిడిఒ దాసరి మేరీ, ఎస్ఐ మారుతి, ఎంఇఒ మహబూబ్‌జాన్, గ్రామీణ అభివృద్ధి ఎపిడి లోకేశ్వర్ అన్నారు. మండలంలోని కోగిలతోట, సమ్మతగేరి గ్రామాల్లో శనివారం జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొత్త పెన్షన్ లబ్దిదారులకు ధ్రువీకరణ పత్రాలు, పట్టాదారుపాస్ పుస్తకాలు, కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ ఆదినారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ బాలచంద్ర ఆచారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: రాజకీయలకతీతంగా అర్హులకు ప్రభుత్వ పథకాలు అందిస్తున్నట్లు ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బివి జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని బైలుప్పల, గంజహళ్లి గ్రామాల్లో జన్మభూమి మాఊరు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమ పథకాలు పింఛన్లు, ఎన్‌టిఆర్ గృహాలు, రేషన్‌కార్డుల మంజూరులో ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండా అర్హులైన ప్రతి లబ్దిదారునికి అందిస్తా మన్నారు. ప్రతి గ్రామం లో సిసి రోడ్లు, తాగు నీరు, డ్రైనేజీ సంబంధిత అధికారులతో ప్రజల సమక్షంలో మాట్లాడిస్తూ ఇప్పటి వరకు జరిగిన పను లు ఇంకా చేయాల్సిన వాటి గురించి ప్రజలకు వివరించారు.

అంగన్‌వాడీ, విద్యుత్ ఉప కేంద్రం ప్రారంభం: గంజహళ్లి గ్రామంలో రూ.7 లక్షలతో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం గంజహళ్లి శివారులో దీనదయాళ్ ఉపాధ్యాయ గ్రామ జ్యోతి పథకం కింద రూ.2.67 కోట్లతో ఏర్పాటైన 33/11కెవి విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంభించారు. దీని ద్వారా 1210 గృహాలు, 750 వ్యవసాయ కనెక్షన్ల ద్వారా ప్రజలు, రైతులు లబ్దిపొందుతారన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి మురళీకృష్ణ, టిడిపి మండల కన్వీనర్ పార్వతమ్మ, వెంకటకృష్ణమనాయుడు, రంగారెడ్డి, బేతాల బడేసాబ్, ప్రభాకర్‌నాయుడు, నూరా, జయరాముడు, తహశీల్దార్ బాల గణేషయ్య, ఎంపిడిఒ నాగరాజు, ఐసిడిఎస్ సిడిపిఒ విజయ, విద్యుత్ ఎఇ ఉలిగయ్య పాల్గొన్నారు.

మంత్రాలయం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా చంద్రబాబు పాలన సాగిస్తున్నారని టిడిపి కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి అన్నారు. శనివారం జన్మభూమి మాఊరు కార్యక్రమంలో భాగంగా మండలంలోని రచ్చుమర్రి, సుంకేశ్వరి గ్రామాల్లో నిర్వహించిన జన్మభూమిలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి మంజూరైన రేషన్ కార్డులు, చంద్రన్న బీమా, చంద్రన్న సంక్రాంతి కానుకను పంపిణీ చేశారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే జన్మభూమి మా ఊరు కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. పలు సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి బాలునాయక్, ఎంపిడిఒ మధుసూదన్‌రెడ్డి, ఎఇ శివశంకర్, ఎపిఒ తిమ్మారెడ్డి, ఆర్‌అండ్‌బి ఎఇ శ్రీహరి, హౌసింగ్ ఎఇ సత్యభాస్కర్, విఆర్‌ఒ ఆనంద్, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: సిఎం చంద్రబాబుపై వైఎస్ జగన్ బురద చల్లేందుకు ప్రయత్నిస్తే ప్రజలు నమ్మరని టిడిపి జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జన్మభూమి మాఊరు కార్యక్రమంలో కమ్మలదిన్నె గ్రామాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ప్రజల అవసరాలు తీర్చేందుకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. చంద్రన్న బీమా పేదలకు ఆసరాగా ఉంటుందన్నారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న చంద్రబాబును ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర పేరుతో విమర్శిస్తున్నా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడకుండా తన ఉనికిని కాపాడుకునేందుకు అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించి పాదయాత్ర చేయడం ప్రజలకు బాగా తెలుసన్నారు. మరోసారి సిఎం చంద్రబాబే అవుతారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన సామూహిక శ్రీమంతాలు, అన్నప్రాసనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి, జిల్లా కార్యదర్శి నరవ రమాకాంతరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకెపోగు ప్రభాకర్, టిడిపి నాయకులు ఈరన్న, గోవిందు పాల్గొన్నారు.

ఆదోని: ప్రజలెదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకే జన్మభూమి మా ఊరు కార్యక్రమాలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు. శనివారం పట్టణంలోని పలు వార్డుల్లో జన్మభూమి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు ఇళ్లు నిర్మించాలనే ఉద్దేశంతో ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకాన్ని చంద్రబాబు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో ఎంఇ విశ్వనాథ్, ఎఇ, డిఇ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు, భాస్కర్‌రెడ్డి, కొలిమి రామన్న, నాయకులు ఫక్రుద్దీన్, బసాపురం రామస్వామి తదితరులు పాల్గొన్నారు.


చిప్పగిరి: అర్హులైన ప్రతి పేదవాడికి పింఛన్లు, గృహాలు, రేషన్ కార్డులు అందిస్తున్నట్లు నోడల్ అధికారి రామచంద్రారెడ్డి, ఎంపిడిఒ అల్లాబకాష్, తహశీల్దార్ వలిబాష తెలిపారు. శనివారం గుమ్మనూరు, కాజీపురం గ్రామాల్లో సర్పంచులు వలిసక్క, మల్లమ్మ అధ్యక్షతన జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఏ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులైన వారికి పింఛన్లు అందించామన్నారు. కార్యక్రమంలో ఈఒఆర్‌డి భాస్కర్‌రావు, ఎంఇఒ నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సిఎ ట్రోఫీ గురురాజ స్కూల్ సొంతం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోచా బ్రహ్మానందరెడ్డి సౌజన్యంతో గత వారంరోజులుగా నిర్వహించిన ఎన్‌సిఎ సచిన్ టెండూల్కర్ ట్రోఫీని గురురాజ పాఠశాల క్రీడాకారులు విజేతగా నిలిచి సొంతం చేసుకున్నారు. శనివారం గురురాజ స్కూల్, ఎస్‌పిజి పాఠశాలల మధ్య జరిగిన ఫైనల్ పోటీల్లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఎస్‌పిజి హైస్కూల్ జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 7వికెట్లు నష్టపోయి 119 పరుగులు చేయగా, తదుపరి బ్యాటింగ్ చేసిన గురురాజ క్రీడాకారులు 15.3ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 120 పరుగులు చేసి విజేతగా నిలిచారు. ఎస్‌పిజి హైస్కూల్ జట్టు రన్నర్స్ షీల్డ్ సాధించారు. బహుమతి ప్రధానోత్సవానికి పోచా బ్రహ్మానందరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలైన జట్టుకు రోలింగ్ ట్రోఫీ, శాశ్వత షీల్డ్, జట్టు సభ్యులకు బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలు, రన్నర్స్ జట్టుకు రన్నర్స్ ట్రోఫీ, జట్టు సభ్యులకు రజత పతకాలు, ప్రశంస పత్రాలు అందజేశారు. క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ క్రికెట్ అభివృద్ధి కోసం యువ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. పద్మావతినగర్ స్టేడియంలో ఎపి క్రికెట్ అసోసియేషన్ సహకారంతో నెట్లు ఏర్పాటు చేసి ఉచిత శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించడానికి తమ సహకారం ఎల్లప్పుడు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ వర్కింగ్ అధ్యక్షుడు స్వామిరెడ్డి, కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి సతీష్‌రెడ్డి, అంపైర్లు పుటాలీ తదితరులు పాల్గొన్నారు.

వలస జీవుల బతుకు బుగ్గి



ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

జిల్లాలో వర్షాభావం, అధిక వర్షాలతో వ్యవసాయం పూర్తిగా దెబ్బ తినడంతో చేసేందుకు పనులు లేక బతుకుదెరువు కోసం వెళ్లి తిరిగి వస్తున్న వలస జీవుల బతుకు బుగ్గి అయ్యింది. హోళగుంద మండలం కొత్తపేట గ్రామానికి చెందిన పేదలు బతుకుదెరువు కోసం నల్గొండ జిల్లాకు వెళ్లారు. టెంపో ట్రక్‌లో తిరిగి వస్తుండగా ఆస్పరి మండలం చిన్న హోతూరు వద్ద టైరు ఊడిపడి బోల్తా పడడంతో 8 మంది మృతి చెందారు. ప్రభుత్వం ఉపాధి పనులను ఊర్లో పెట్టింటే ఇన్ని ప్రాణాలు పోయేవి కాదుకదా అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘోర ప్రమాదానికి 24 గంటల ముందు ఎమ్మిగనూరు కోటేకల్లు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలోనూ నలుగురు మృతి చెందారు. ఈ వారంలో జరిగిన రోడ్డు ప్రమాదాలలో దాదాపు 20 మంది దాకా మృతి చెందారు. మొత్తంగా ఈ వారంలో రోడ్లు రక్తసిక్తమయ్యాయి. టిడిపి ప్రభుత్వం ఆర్భాటంగా చేపట్టిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని ప్రజలు అడుగడుగునా నిలదీస్తున్న పరిస్థితి ఉంది. మంగళవారం నుంచి మొదలైన జన్మభూమి కార్యక్రమంలో ఆద్యంతం ప్రజలు తమ సమస్యలపై నిలదీస్తూనే ఉన్నారు. అడిగిన వారికందరికీ పింఛన్‌లను ఇస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా పింఛన్, రేషన్ కార్డుల కోసం కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వచ్చి పడుతున్నాయి. రోడ్లు, మురుగు కాలువల సమస్యలపైనా, రుణమాఫీ పైనా అడుగడుగునా నిలదీస్తున్న


వలస కూలీలు మృతి (ఫైల్)

పరిస్థితి ఉంది. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జీలు అంతా తామై జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శనివారం ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో జన్మభూమి కార్యక్రమం వేదికపై ఉన్న ఏరాసు ప్రతాప్ రెడ్డిని సిపిఎం నిలేసింది. కల్లూరు మండలం బొల్లవరంలో రుణార్హత పత్రాలు ఇచ్చిన కౌలు రైతులందరికీ రుణాలివ్వాలని కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో నిలేశారు. ఇప్పటిదాకా జరిగిన జన్మభూమి -మాఊరు కార్యక్రమంలో తమ సమస్యలు పరిష్కారం కాలేదని, ఇప్పుడు మీరొచ్చి ఏం చేస్తారంటూ ప్రజలు నిలదీ స్తున్న పరిస్థితి ఉంది. ఇప్పటిదాకా జరిగిన 4 విడతల జన్మభూమిలో దాదాపు 6 లక్షల దాకా వినతి పత్రాలు ఇస్తే ఇప్పటిదాకా ఎన్ని సమస్యలు పరిష్కరించారని ప్రజలు నిలదీస్తున్న పరిస్థితి. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కెఇ కృష్ణమూర్తి, పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ పాల్గొంటున్నారు. వచ్చేవారంలో జరగనున్న సిపిఎం జిల్లా మహాసభలను ఆపార్టీ యంత్రాంగం సమాయత్తమవుతోంది. ఈ వారంలో సిపిఎం మహాసభను జయప్రదం చేయాలని ప్రచారజాతను ప్రారంభించారు. ఈ ప్రచారజాత జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో పర్యటించింది. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు కర్నూలు నగరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. 13 జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులతో నిర్వహిస్తున్న ఈ చెకుముకి సైన్స్ సంబరాలను సిడిబిఎం ఫ్లోర్ లీడర్ మోహన్‌రావు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక రాయల్టీని ఎత్తివేసి ఉచితంగా ప్రజలకు అందిస్తామని చెబుతున్నా ఇసుక మాఫియా గుప్పిట్లో ఉందని ఈ వారంలో జరిగిన ఘటన నిరూపిస్తోంది. ఇసుక రవాణాపై పట్టుకోసం వెల్దుర్తి మండలంలో తెలుగు తమ్ముళ్లు వేట కొడవళ్లతో దాడులు చేసుకోవడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.


మాట్లాడుతున్న కెఇ కృష్ణమూర్తి

పసిగుడ్డు నుంచి పండు ముసలి వరకు

టిడిపి సంక్షేమ పథకాలు : కెఇ.క్రిష్ణమూర్తి

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

రాష్ట్రంలో ఉన్న ప్రజలకు పసిగుడ్డు నుంచి పండు ముసలి వరకు టిడిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందని ఉపముఖ్యమంత్రి కెఇ.క్రిష్ణమూర్తి అన్నారు. శనివారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో అధికారులు ఏర్పాటు చేసిన జన్మభూమి మాఊరు 5వ విడత కార్యక్రమానికి కెఇ.క్రిష్ణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశంలోనూ ఎక్కడా లేని విధంగా చంద్రన్నబీమాను అమలు చేయడం టిడిపికే సాధ్యమని ఆయన అన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.2.50 వేల వైద్యాన్ని ఉచితంగా పొందవచ్చన్నారు. తన చేతుల మీదనే కర్నూలు జిల్లా ప్రజలకు రూ.30 కోట్లకు పైగా ఎన్టీఆర్ వైద్యసేవకు నగదును అందజేశానన్నారు. అనంతరం గ్రామస్తులు గ్రామంలో మంచినీటి సమస్యను, సిసిరోడ్ల పరిస్థితిని ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంచినీటి సమస్య సత్వర పరిష్కారానికి జిల్లా కలెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ తమ గ్రాంటులో రూ.30 లక్షలను హంద్రీనది నుంచి పైపులైనును తక్షణమే విడుదల చేస్తామని చెప్పారు. 3వ వార్డులో సిసిరోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని ఎంపి బుట్టారేణుక గ్రామస్తులకు హామీనిచ్చారు. గ్రామంలో పక్కాఇళ్లు, ఇళ్ల స్థలాలు ప్రభుత్వం ద్వారా మంజూరు చేయిస్తానని ఈ సందర్భంగా ఆయన ప్రజలకు తెలియజేశారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి జిల్లాకు రూ.3 కోట్ల నిధులను రాబట్టడానికి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని తెలిపారు. వ్యక్తిగత మరుగుదొడ్లను ఖచ్చితంగా గ్రామస్తులు నిర్మించుకోవాలని, సంక్షేమ పథకాలు ప్రజలకు అంది వారు అభివృద్ధి చెందిన రోజే పథకాల లక్ష్యం చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే మణిగాంధీ, నియోజకవర్గ అభివృద్ధి అధికారి మల్లిఖార్జున, మండల ప్రత్యేకాధికారి భాస్కర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, ప్యాలకుర్తి సర్పంచి మునిస్వామి, ఎంపిడిఒ ఆదయ్య, తహశీల్దార్ రామకృష్ణ, ఆయాశాఖల మండల స్థాయి అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కర్నూలులో 5కె రన్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జన్మభూమి మాఊరు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 6:30 నుంచి 7:30 వరకు 5కె రన్ కార్యక్రమాన్ని సి.క్యాంపు సర్కిల్ నుంచి రాజ్‌విహార్ మౌర్యఇన్ మీదుగా 5 రోడ్ల కూడలి, జిల్లా క్రీడా ప్రాంగణం వరకు నిర్వహిస్తున్నట్లు కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ సిబి.హరినాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హ్యాపి సండే కార్యక్రమాన్ని కూడా సి.క్యాంపు సర్కిల్‌లో నిర్వహించబడు తుందని, ఈ కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పర్యటనలకే పరిమితమైన సిఎం

రాయలసీమ జిల్లాల అభివృద్ధి శూన్యం : షడ్రక్

ప్రజాశక్తి-నందికొట్కూరు

పర్యటనలకే పరిమితం అయిన సిఎం రాయలసీమ జిల్లాల అభివృద్ధిని చేయడంలో శూన్యమని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు షడ్రక్ అన్నారు. శనివారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాయలసీమ వాసి అయి ఉండి రాయలసీమ ప్రాంతానికి తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. రాయలసీమ జిల్లాలోని భూమిని ఇష్టానుసారంగా సేకరించి బడా కంపెనీలకు, పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారు కానీ, అందులో స్థానికులకు ఉద్యోగాలు కేటాయించడం లేదన్నారు. ఈ జిల్లాలో ఒక్క జాతీయ ప్రాజెక్టు కూడా నిర్మించలేదన్నారు. సీమ కరువుసీమగానే ఉంది తప్పా ఎక్కడ అభివృద్ధి జరగలేదన్నారు. నీటి ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నామని చెబుతున్నారు అవి ఎప్పుడు ఎత్తిపోస్తాయో, ఎప్పుడు ఆగిపోతాయో తెలియదన్నారు. కర్నూలు జిల్లాలో సోలార్ ప్లాంట్ స్థాపించారు దానివల్ల ఎవరికి ఉపాధి లభించలేదన్నారు. తంగడెంచ వద్ద అంబుజ, జైయిన్ ఇరిగేషన్ సీడ్‌హబ్ అంటూ హంగామ చేశారు. నేటికి అందులో ఉద్యోగాలు లేవు. వందల ఎకరాల భూములను కారు చౌకగా బడా కంపెనీలకు కట్టబెట్టారు. ఆయన ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నిలబెట్టుకోలేదని, విదేశీ పర్యటనలతో పాటు, రాయలసీమ జిల్లాల



సమావేశంలో మాట్లాడుతున్న షడ్రక్

పర్యటన కూడా ఎక్కువగానే చేస్తున్నారు. ముఖ్యమంత్రి అయి 4 సంవత్సరాలు కావస్తున్న ప్రజల ముందు అమరావతి ఓ కలగానే మిలిగిపోతుంది. ఇప్పటికైనా కళ్లుతెరచి రాయలసీమ జిల్లాలో కనీసం 2 వేలమందికి ఉపాధి చూపించే పరిశ్రమను స్థాపించాలని, నిజాయితీగా నిరుద్యోగులకు శాశ్వత ఉపాధి చూపించాలని, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజానీకానికి ఇచ్చిన హామీలలో కనీసం కొన్నిటినైన నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. విద్యా, ఉపాధి కోసం రాయలసీమలో ఉన్న పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఒక్క విద్య సంస్థనైనా స్థాపించారా అని ప్రశ్నించారు. కేవలం హామీలతోనే సరిపెడుతున్నారు. ఇప్పటికైనా చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఎ.రాజశేఖర్, మండల నాయకులు భాస్కర్‌రెడ్డి, లాజరేసు, రాజు, నాగేశ్వర్‌రావు, ఆంజనేయులు పాల్గొన్నారు.